# వీలునామా

(అల్ వసియ్యత్)




రచన

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ

మసీహ్ మౌవూద్, మహ్దీ మ'హూద్

అలైహిస్సలాతు వస్సలాం

(దైవ వాణి)

دُنیا میں ایک نذیر آیا پر دُنیا نے اُس کو قبول نہ کیا لیکن خدا اُسے قبول کرے گا
اور بڑے زور آور حملوں سے اُس کی سچائی ظاہر کر دے گا

అనగా: ప్రపంచములో ఒక హెచ్చరించువాడు వచ్చాడు. ప్రపంచము అతనిని స్వీకరించలేదు, కాని అల్లాహ్ అతనిని స్వీకరించును. శక్తివంతమైన నిదర్శనములతో అతని సత్యమును బహిర్గతము చేయును.

ఈ పుస్తకము పేరు

# వీలునామా

## (అల్ వసియ్యత్)

**రచన**

**హజ్రత్ హుజ్జతుల్లాహ్ మసీహ్ మౌవూద్, మహ్దీ మ'హూద్**
**మిర్జా గులాం అహ్మద్ అలైహిస్సలాతు వస్సలాం ఖాదియాని**

**అనువాదము**

షబ్బీర్ అహ్మద్ యాఖూబ్ ఎబ్.ఏ.

**ప్రచురణ**

నజారత్ నష్రో ఇషాఅత్
సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

# رسالہ الوصیت

# AL - WASIYYAT

URDU BY

**HAZRAT MASIH MOUD ALAIHISSALAM**

TELUGU

**WEELUNAAMA**

Telugu Translation By
Shabbir Ahmad Yaqub H.A.
Riview By
Sk. Ibrahim Nasir B.A., B.Ed.

Ist Edition : 2008, Copies : 2000
2nd Edition : 2021 Copies : 500
Printed at : Fazl-e-Umar Printing Press Qadian
Published by: Nazarat Nashr-o-Isha'at,
Sadr Anjuman Ahmadiyya Qadian,
Dist: Gurdaspur, Punjab, India,143516

ఇతర వివరాలకు సంప్రదించగలరు
www.alislam.org
www.ahmadiyyamuslimjamaat.in
Toll Free No: 1800-103-2131

# తొలి పలుకులు

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అల్ వసియ్యత్ అను ఈ పుస్తకమును డిసెంబర్ 1905లో రచించారు. ఇందులో వారు తమ మరణము గురించి అల్లాహ్ తఆలాతో దైవవాణి పొందినందున తమ జమాఅత్‌కు సంతృప్తి కలిగిస్తు ఇట్లు తెలిపిరి. రెండు శక్తులను ప్రదర్శించుట అల్లాహ్ తఆలా ప్రాచీన ఆచారము. మొదటి శక్తి సందేశహరుల ఉనికి కాగా సందేశహరుడు మృతి చెందిన తర్వాత ద్వితీయ శక్తి బహిర్గతమగును. ఇలా హుజూర్ అలైహిస్సలాం తమ మృత్యువు గురించి తెలుపుతు తమ జమాఅత్‌లో ఖిలాఫత్ (ఉత్తరాధికాదిత్వ) పరంపర శాశ్వతంగా ప్రారంభమగునని శుభవార్త కూడ అందించిరి. ఈ పుస్తకములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దైవ అభీష్టము మేరకు ఇస్లాం వ్యాప్తి, పవిత్ర ఖుర్ఆన్ బోధనల ప్రచార ఉద్దేశముల కొరకు వసియ్యత్ (వీలునామా) వ్యవస్థ స్థాపనను ప్రకటించిరి. జమాఅత్ సభ్యులమైన మనమందరము ఈ సంక్షిప్త పుస్తకమును శ్రద్ధతో పఠించవలెను. ఖిలాఫత్ లాంటి అద్భుత వరము లభించినందుకు అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుతు తమ ప్రతిజ్ఞలను, బాధ్యతలను మనము తగిన రీతిలో నిర్వర్తించవలెను.

హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఆమోదముతో ఈ పుస్తకమును తెలుగు భాషలో రెండవసారి ప్రచురిస్తున్నాము.

గౌ॥ షబ్బీర్ అహ్మద్ యాఖూబ్ ముబల్లిఘ్ సిల్సిలహ్ నజారత్ దావతె ఇలల్లాహ్ జూనుబీ హింద్ గారు దీనిని తెలుగులో అనువదించగా ప్రథమ ముద్రణ సందర్భంగా గౌ॥ షేఖ్ ఇబ్రాహీమ్ నాసిర్ గారు పునఃపరిశీలించిరి. ద్వితీయ ముద్రణను గౌ॥ ముహమ్మద్ ఇస్మాయిల్ ముఅల్లిమ్ సిల్సిలహ్, గౌ॥ హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ గారలు పరిశీలించి, ప్రూఫ్ రీడింగ్ చేశారు. ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన వారందరికి అల్లాహ్ తఆలా చక్కటి ప్రతిఫలము నొసంగుగాక!

*హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్*
*నాజిర్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్*

# హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం

## (రచయిత పరిచయం)

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్, మహ్దీ మ'హూద్ అలైహిస్సలాం 1835 ఫిబ్రవరి 13వ తేదీన భారత దేశములోని ఒక చిన్న పట్టణము ఖాదియాన్‌లో జన్మించారు. బాల్యము నుండే వారు దైవారాధన, దుఆలు (ప్రార్థనలు), పవిత్ర ఖుర్‌ఆన్‌తో పాటు ఇతర గ్రంథముల పఠనములో నిమగ్నమై వుండేవారు. అప్పుడు నలు వైపుల నుండి ఇస్లాంపై దాడులు జరుగుతున్నందున దాని దయనీయ స్థితిని చూసి తీవ్ర కలతకు గురయ్యేవారు. ఇస్లాం రక్షణతో పాటు దాని బోధనలను స్వచ్ఛమైన రీతిలో ప్రపంచములో వ్యాపింపజేయుటకు వారు (అ) సుమారు 90 కంటే అధిక పుస్తకములను రచించారు. వేల సంఖ్యలో ఉత్తరములు వ్రాశారు. అనేక ధార్మిక సంభాషణలు, చర్చలు జరిపారు. మానవులకు సృష్టికర్తతో సంబంధమేర్పరచ గల ధర్మము ఇస్లామ్ మాత్రమే అని, ఇస్లాంను అనుసరించి మానవుడు ప్రవర్తనల పరంగా, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేరవచ్చునని వారు తెలిపారు.

చిన్నతనము నుండే వారు సత్య, దివ్య స్వప్నములతో పాటు

దైవ సంభాషణలతో సత్కరించబడిరి. 1889 మార్చి 23వ తేదీన అల్లాహ్ తఆలా అభీష్టము మేరకు బైఅత్ ప్రతిజ్ఞ పరంపరను ప్రారంభించి ఒక పవిత్ర సంస్థకు పునాది వేశారు. దైవ సంభాషణలలో క్రమంగా ప్రగతి సంభవించెను. కావున ప్రపంచమంతటా వివిధ నామములతో గుర్తింపు పొందిన ప్రపంచ సంస్కర్త వాగ్దత్త తానేనని అల్లాహ్ తఆలా ఆదేశముతో ప్రకటించు కొనిరి. హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము అవతరించవలసిన మసీహ్, మహ్దీ తానేనని కూడ వారు ప్రకటించారు. ఇప్పుడు అహ్మదియ్యా సంస్థ ప్రపంచ పటములోని 216 కంటే అధిక దేశములలో స్థిరంగా ఏర్పడినది.

1908 మే 26వ తేదీన వారు పరమపదించిన తర్వాత పవిత్ర ఖుర్ఆన్, ఇస్లాం స్థాపకులైన హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారము వారి (అ) అవతరణ లక్ష్యమును పూర్తి చేయుటకు ఖిలాఫత్ (ఉత్తరాధికాధిత్వ) వ్యవస్థ ప్రారంభమయ్యెను. ప్రస్తుతం వారి (అ) ఐదవ ఖలీఫాగా, అహ్మదియ్యా జమాఅత్ (సంస్థ) వర్తమాన ఇమామ్ (అంతర్జాతీయ అధినేత)గా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ప్రస్తుతం లండన్ కేంద్రముగా విధులు నిర్వహిస్తున్నారు.

☼☼☼

# పుస్తక పరిచయం

(హజ్రత్ మౌలానా జలాలుద్దీన్ షంస్)

**వీలునామా**

**(అల్ వసియ్యత్)**

ఇది డిసెంబర్ 1905 సం॥లోని పుస్తకము. ఈ పుస్తకములో హుజూర్ అలైహిస్సలాం తమ మరణం ఆసన్నమైనదని సూచించే దైవవాణీలన్నిటిని పొందుపరిచారు. ప్రవక్త మరణం తరువాత అతని సమాజంలో సంభవించే భయంకర స్థితి గురించి హుజూర్ అలైహిస్సలాం జమాత్ సభ్యులకు భరోసా ఇస్తూ అల్లాహ్ తాలా తన ప్రాచీన పద్ధతి ప్రకారముగా రెండు శక్తులను చూపునని ఉపదేశించారు.

(1) మొదటి శక్తి ప్రవక్త యొక్క అస్థిత్వము. (2) ప్రవక్త మరణం తరువాత రెండవ శక్తి బహిర్గతమగుతుంది. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణించిన తరువాత అల్లాహ్ తాలా హజ్రత్ అబూబకర్ (రజి) ను నిలబెట్టి ఇస్లాంను నాశనం కాకుండా కాపాడినాడు. హుజూర్ అలైహిస్సలాం తన మరణవార్త నిస్తూ తన జమాత్‌లో ఖిలాఫత్ యొక్క శాశ్వత వ్యవస్థ గూర్చి శుభవార్తనందించారు. హుజూర్ అలైహిస్సలాం హజ్రత్ అబూబకర్ (రజి) గూర్చి స్పష్టమైన మాటలలో చెప్పిన తరువాత ఇలా తెలిపినారు,

**"అయితే నేను వెళ్ళనంతవరకు ఆ రెండవ**

**శక్తి వెలువడదు. నేను వెళ్ళిన తరువాత అల్లాహ్ ఆ ద్వితీయ శక్తిని మీ కొరకు పంపిస్తాడు. అది ఎల్లప్పుడు మీతో ఉంటుంది."**

(అల్ వసియ్యత్ రుహాని ఖజాయిన్ సంపుటి:20 పుట:305)

ఈ పుస్తకములో హుజూర్ అలైహిస్సలాం దైవ అభీష్టం మేరకు ఇస్లాం ప్రచురణ మరియు ఖుర్ఆన్ ఉద్దేశ్యముల సంకల్ప ప్రచారం కోసం ఒక శాశ్వత మరియు అభివృద్ధి చెందు వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనిని వీలునామా వ్యవస్థ అని పిలుస్తారు. రాబోయే కాలంలో వివిధ ఆర్థిక వ్యవస్థలలో ఇది "కొత్త వ్యవస్థ" అని రుజువు అవుతుంది. దీని ప్రకారం, ఇస్లాం ప్రచురణ కొరకు, వసియ్యత్ చేయు ప్రతి వ్యక్తి తన ఆదాయంలో మరియు ఆస్తిలో కనీసం పదోవంతు ఈ సంస్థకు చెల్లించాలి.

వసియ్యత్ చేయు వ్యక్తి వ్యక్తిగతంగా ధర్మబద్ధుడై, మరియు నిషిద్ధమైన వాటికి దూరముండువాడై మరియు విగ్రహారాధన నుండి, దురాచారాల నుండి దూరంగా వుంటు స్వచ్ఛంగా మరియు నిజాయితీగా వుండుట కూడా తప్పనిసరి. హుజూర్ అలైహిస్సలాం దైవ అభీష్టం మేరకు ఇలా వసియ్యత్ చేయువారి కొరకు ఒక ఖబ్రిస్తాన్ (స్మశానవాటిక)ను సూచిస్తూ ఇలా ఉపదేశించారు,

"అల్లాహ్ దీనినే బహిష్తీమఖ్బరహ్‌గా చేసి శుభములు కలిగించవలెనని, వాస్తవముగా ప్రపంచము కంటే ధర్మమునకు ప్రాముఖ్యతనిచ్చి, ప్రపంచ ప్రేమను వదిలి, దేవునికే అంకితమై, తమలో పవిత్రమైన మార్పు తెచ్చుకొని, ముహమ్మద్ ప్రవక్త (స.అ) అనుచరుల వలే విశ్వాస, సత్య నిదర్శనాలు ప్రదర్శించిన ఈ సంఘపు పవిత్ర

హృదయుల శయనాగారము కావాలని నేను దుఆ
చేస్తున్నాను. ఆమీన్ యా రబ్బల్ ఆలమీన్"

(అల్ వసియ్యత్ రుహాని ఖజాయిన్ సంపుటి:20 పుట:316)

అల్ వసియ్యత్ పుస్తకముతో ఒక అనుబంధ సంచిక కూడా చేర్చబడింది. దీనిలో వసియ్యత్ మరియు బహిష్తీమఖ్బరహ్‌లో సమాధి చేయడానికి సంబంధించిన వివరణాత్మక నియమాలను హుజూర్ అలైహిస్సలాం స్వయంగా పొందుపర్చినారు.

చివరలో సదర్ అంజుమన్ అహ్మదియ్య ఖాదియాన్ ప్రథమ సమావేశము 29 జనవరి, 1906 నివేదిక కూడా జతపర్చనైనది, ఇది కూడా అల్ వసియ్యత్ వ్యవస్థకు సంబంధించినదే.

✪✪✪

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡم

اَلۡحَمۡدُ لِلّٰہِ رَبِّ الۡعٰلَمِیۡنَ ؕ وَالصَّلٰوۃُ وَالسَّلَامُ عَلٰی رَسُوۡلِہٖ مُحَمَّدٍ

وَّاٰلِہٖ وَاَصۡحَابِہٖ اَجۡمَعِیۡنَ۔ اَمَّا بَعۡد

నా మరణ కాలము సమీపించినదని వైభవోపేతుడైన అల్లాహ్ ఎడతెగని సువార్త వాణి ద్వారా నాకు తెలిపెను. ఇందుకోసం అతడు పంపిన సువార్తా వాణి నా అస్థిత్వమును పునాదులతో సహా కదిలించి, ఈ జీవితము పై నాకు ప్రేమ లేకుండ చేసింది. కనుక నేను నా మిత్రుల కోసం, నా మాటలతో లబ్ధిపొందాలనుకునే వారందరికోసం కొన్ని ఉపదేశములు వ్రాయుట ఉత్తమముగా భావిస్తున్నాను. కావున నాకు నా మరణ వార్త తెలిపి నాలో ఈ ప్రేరణ పుట్టించిన ఆ దైవ వాణిని ముందుగా తెలియజేస్తాను, అది అరబ్బి భాషలో గలదు, తరువాత ఉర్దు సువార్తవాణి కూడ వ్రాయబడును.

قَرُبَ اَجَلُكَ الۡمُقَدَّرُ وَلَا نُبۡقِیۡ لَكَ مِنَ الۡمُخۡزِيَاتِ ذِكۡرًا۔ قَلَّ مِيۡعَادُ رَبِّكَ وَلَا نُبۡقِیۡ لَكَ مِنَ الۡمُخۡزِيَاتِ شَيۡئًا۔ وَاِمَّا نُرِيَنَّكَ بَعۡضَ الَّذِیۡ نَعِدُهُمۡ اَوۡ نَتَوَفَّيَنَّكَ۔ تَمُوۡتُ وَاَنَا رَاضٍ مِّنۡكَ۔ جَاءَ وَقۡتُكَ وَنُبۡقِیۡ لَكَ الۡاٰيَاتِ بَاهِرَاتٍ ؕ۔ جَاءَ وَقۡتُكَ وَنُبۡقِیۡ لَكَ الۡاٰيَاتِ بَيِّنَاتٍ ؕ۔ قَرُبَ مَا تُوۡعَدُوۡنَ۔ وَاَمَّا بِنِعۡمَةِ رَبِّكَ فَحَدِّثۡ۔ اِنَّهٗ مَنۡ يَّتَّقِ اللّٰهَ وَيَصۡبِرۡ فَاِنَّ اللّٰهَ لَا يُضِيۡعُ اَجۡرَ الۡمُحۡسِنِيۡنَ۔

అనువాదము:- నీ మృత్యువు సమీపించినది, మేము నీ

విషయంలో నీకు అవమానము కల్గించు విషయాలను నామరూపము లేకుండా చేస్తాము, నీకు అల్లాహ్ ఇచ్చిన కాలపరిమితి కొద్దిగానే మిగిలి వుంది.  మేము నీ అవమానమునకు కారణమగు అన్ని అపవాదములను దూరము చేస్తాము. శత్రువుల గురించి చేసిన మా భవిష్యవాణులలో నుండి కొన్ని నీకు చూపుటలో గాని లేదా నీకు మరణమివ్వడములో గాని మేము సమర్థులము. నేను నీతో సంతోషపడినప్పుడు నీవు పరమపదించెదవు. నీ ధృవీకరణ నిమిత్తము మేము స్పష్టమైన నిదర్శనములు చిరకాలము భద్రపరిచెదము. వాగ్దానము చేయబడినది సమీపంలో గలదు. నీకు, నీ ప్రభవు కురిపించిన అనుగ్రహాన్ని ప్రజల ముందు వివరించుము. అల్లాహ్‌కు భయపడి, సహనము వహించిన నీతిమంతుల ప్రతిఫలాన్ని అల్లాహ్ వృధా చేయడు.

ఇచట గుర్తుంచు కోవలసినదేమనగా అల్లాహ్ నీ విషయము లో నీ గౌరవానికి భంగము కల్గించే అంశాలను వదలమని అనుటలో రెండు అర్థములు గలవు. మొదటిది: అవమానపర్చాలనే ఉద్దేశముతో ప్రచురించే విమర్శలను మేము దూరము చేస్తాము. ఆ ఆరోపణల నామరూపముండదు. రెండవది: తమ పోకిరి తనమును వదలని, చెడు ప్రస్తావనను వీడని దుష్టులను ప్రపంచము నుండి లేపుదుము. ప్రపంచము నుండి నిర్మూలించెదము. వారు నాశనమగుట వలన వారి నీచమైన అపవాదములు నాశనమగును. ఆ తరువాత అల్లాహ్ నాతో నా మరణమును గూర్చి ఉర్దు భాషలో ఇట్లు సంభోదించెను. “కొన్ని దినములు మాత్రమే మిగిలి యున్నవి. ఆ దినమున అందరిపై ఉదాసీనత కమ్ముకొనును, ఇది సంభవించును, ఇది సంభవించును, ఇది సంభవించును. అన్ని ఘటనలు, ప్రకృతి వింతలు వెలుగు చూసిన తరువాత నీ సంఘటన

సంభవించును."

సంఘటనల గూర్చి నాకు అందించబడిన జ్ఞానమేమనగా, మృత్యువు ప్రపంచములో నలువైపుల వ్యాపిస్తుంది. ప్రళయ దినమును తలపించు తీవ్రమైన భూకంపములు సంభవిస్తాయి. అవి భూమిని తలక్రిందులుగా చేసి వేయును. చాలా మంది జీవితము తో విరక్తి చెందుదురు. పశ్చాత్తాపపడు వారిని, పాపములను వీడు వారిని అల్లాహ్ కరుణించును. ప్రతి సందేశహరుడు ఈ కాలము గూర్చి చెప్పినవన్ని తప్పక సంభవిస్తాయి. ఎవరైతే తమ హృదయాల ను సరిచేసుకొని, అల్లాహ్‌కు ఇష్టమైన మార్గాలను అవలంభిస్తారో వారికి ఎలాంటి భయము గాని దుఃఖము గాని ఉండదు. నీవు నా వైపు నుండి హెచ్చరించువాడవు, సజ్జనుల నుండి అపరాదులను వేరు చేయుటకు నేను నిన్ను పంపినానని అల్లాహ్ నన్నుద్దేశించి ఇలా తెల్పినాడు, ప్రపంచములో ఒక హెచ్చరించువాడు వచ్చెను. కాని ప్రపంచము అతన్ని స్వీకరించలేదు. కాని అల్లాహ్ అతన్ని స్వీకరిస్తాడు. శక్తివంతమైన నిదర్శనముల ద్వారా అతని సత్యాన్ని బహిర్గతమొనర్చును. ☆ చక్రవర్తులు నీ వస్త్రముల నుండి శుభములు వెతికేంతగా నేను నీకు శుభములు కలిగింతును.

భవిష్యత్తులో సంభవించు ఒక తీవ్రమైన భూకంపము గూర్చి

☆ ప్రపంచము కన్నులు తెరిచి చూస్తే నేను శతాబ్ది ఆరంభములో వచ్చినానని తిలకించును. దాదాపు పదునాల్గవ శతాబ్దపు నాల్గవ భాగము కూడ గడిచిపోయింది. హదీసుల ప్రకారము నా ప్రకటన సమయంలో రమజాన్ మాసములో సూర్య, చంద్ర గ్రహణాలు సంభవించాయి. ప్లేగు వ్యాధి కూడా వ్యాపించింది. భూకంపాలు సంభవించాయి. ఇక ముందు కూడ సంభవించును. కాని విచారము! ప్రాపంచిక వ్యామోహులు నన్ను అంగీకరించరైరి. (సమాప్తం)

నాకు తెలుపబడింది. "వసంత ఋతువు మరల వచ్చెను. దైవ వాక్కు మరల పూర్తయ్యెను." అందువలన ఒక భయంకరమైన భూకంపము సంభవించుట అనివార్యము. కాని సత్యవాదులు దీని నుండి సురక్షితముగా ఉంటారు. కావున మీరు సత్యవాదులుగా మారండి. రక్షింపబడుటకు ధర్మనిష్ఠిత్వమును పాటించుము. ఆ భయంకర దినము నుండి సురక్షితముగా నుండుటకు నేడు అల్లాహ్ కు భయపడుము. ఆకాశము తప్పక ఏదో చూపిస్తుంది. భూమి తప్పక ఏదో బహిర్గతము చేస్తుంది.

అల్లాహ్ నాకు ఇలా ఉపదేశించాడు, ఎన్నో సంఘటనలు బహిర్గతమగును. ఎన్నో విపత్తులు భూమిపై సంభవించును. అందులో కొన్ని నా జీవితములో సంభవిస్తాయి, మరికొన్ని నా తరువాత సంభవించును. అతడు ఈ సంఘానికి సంపూర్ణ అభివృద్ధి ప్రసాదించును. కొంత నా హస్తాల మీదుగా మరికొంత నా తరువాత, అల్లాహ్ సాంప్రదాయమిది. మానవున్ని భూమిపై పుట్టించినప్పటి నుండి అతడు తన సందేశహరులకు, ప్రవక్తలకు సహాయము చేస్తు, వారికి విజయాన్ని చేకూరుస్తాడనే ఈ సాంప్రదాయాన్ని నిరంతరము కొనసాగిస్తు వచ్చాడు. దీనిని గూర్చి ఈ విధముగా ఉపదేశిస్తున్నాడు. كَتَبَ اللّٰهُ لَاَغۡلِبَنَّ اَنَا وَرُسُلِىۡ ☆ ఆ విజయమేమనగా అల్లాహ్ తర్కము భూమిపై పూర్తి కావాలని, దానిని ఎవరు ఎదుర్కోకూడదని ప్రవక్తలు, సందేశహరులు ఎలా అభిప్రాయపడు తుంటారో అదే విధముగా అల్లాహ్ గొప్ప చిహ్నముల ద్వారా వారి నిజాయితిని బహిర్గతపర్చును. ఏ యదార్ధమునైతే వారు ప్రపంచములో వ్యాపింపజేయదలిచారో దాని

☆ అనగా "నేను నా ప్రవక్తలు గెలుపు పొందుదురని" అల్లాహ్ నిర్ణయించి వున్నాడు. (అల్ ముజాదిలహ్–58:22)

బీజము వారి హస్తములతోనే విత్తడము జరుగుతుంది. కాని వారి హస్తములతో దానిని సంపూర్ణం చేయడు. అపజయ భయాన్ని కల్గించే సమయములో వారికి మరణమిచ్చి విరోధులకు పరిహసించుటకు, వేళాకోళానికి, నిందించుటకు అవకాశము కల్పిస్తాడు. వారు పరిహసించిన తరువాత తన శక్తి రెండవ హస్తమును ప్రదర్శించి అసంపూర్ణ లక్ష్యాలను సంపూర్ణ స్థాయిలో అభివృద్ధి పరచు సామాగ్రిని కల్పిస్తాడు. అనగా రెండు రకాల శక్తిని ప్రదర్శిస్తాడు. (1) మొదటిది: స్వయముగా ప్రవక్తల హస్తాల ద్వారా తన సృష్టి హస్తాన్ని ప్రదర్శిస్తాడు. (2) రెండవది: ప్రవక్త మరణానంతరము కష్టాలు ఎదురైనప్పుడు, శత్రువులు బలాన్ని ప్రయోగిస్తూ ఇక వీరి పని అయిపోయిందని భావిస్తారు, ఇక ఈ సంఘము నాశనమగు నని విశ్వసిస్తారు. సంఘ సభ్యులు కూడ కలవర పడుదురు. వారి ధైర్యము క్షీణించిపోవును, కొందరు దురదృష్టవంతులు మతభ్రష్టులగుదురు. అప్పుడు అల్లాహ్ తాలా రెండవసారి తన బలమైన సృష్టిని ప్రదర్శిస్తాడు, కూలిపోయే సంఘాన్ని ఆదుకుంటాడు. కావున చివరి వరకు సహనము వహించువారు అల్లాహ్ యొక్క ఈ మహత్యమును చూడగలరు. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు గారి సమయంలో ఈ విధముగానే జరిగింది. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణం, అకాల మరణముగా భావించబడినది. ఎందరో అజ్ఞాన అరణ్యవాసులు మతభ్రష్టులైనారు. అనుచరులు కూడ బాధతో పిచ్చివారిగా మారినారు. అప్పుడు అల్లాహ్ తాలా హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హును ప్రతినిధిగా నియమించి రెండవసారి తన సృష్టి నిదర్శనము చూపి, నాశనమయ్యే ఇస్లాంను రక్షించి, ఇచ్చిన వాగ్దానాన్ని పూర్తి చేసినాడు.

وَلَيُمَكِّنَنَّ لَهُمْ دِيْنَهُمُ الَّذِي ارْتَضٰى لَهُمْ وَلَيُبَدِّلَنَّهُمْ مِّنْ بَعْدِ خَوْفِهِمْ اَمْنًا (అన్నూర్ సూక్తి–24:56) అనగా భయస్థితి తరువాత మళ్ళీ వారి పాదములను మేము స్థిరపరుస్తాము. హజ్రత్ మూసా అలైహిస్సలాం కాలములోను ఇలాగే జరిగింది. వారు (అ.స) తన వాగ్దానము ప్రకారం ఇస్రాయీల్ సంతతిని గమ్యస్థానానికి చేర్చక ముందే ఈజిప్ట్ మరియు పాలస్తీన మార్గమధ్యలో మరణించారు. వీరి మరణంతో ఇస్రాయీల్ సంతతిలో దుఃఖ సముద్రములు ప్రవహించెను. ఈ అకాల మరణ దుఃఖముతో, హజ్రత్ మూసా అలైహిస్సలాం అకస్మాత్తు ఎడబాటుతో ఇస్రాయీల్ సంతతి వారు నలుబది దినముల వరకు రోధించుచుండిరని తౌరాత్‌లో ప్రస్తావించబడినది. ఇదే విధముగా హజ్రత్ ఈసా అలైహిస్సలాం తో వ్యవహరించడము జరిగింది. వారిని శిలువ నెక్కించినప్పుడు వారి శిష్యులందరు చెల్లాచెదురయ్యారు. వారిలో ఒకడు మతభ్రష్టుడయ్యెను.

కనుక ఓ ప్రియులారా! ఆది నుండి అల్లాహ్ పద్ధతి ఇదే. విరోధుల రెండు అసత్యానందములను నశింపజేయుటకు అల్లాహ్ రెండు శక్తులను ప్రదర్శిస్తాడు. కావున అల్లాహ్ ఇప్పుడు తన ప్రాచీన పద్ధతిని విడిచి పెట్టుట అసాధ్యము. అందువలన నేను మీ ముందు ప్రస్తావించిన విషయము గూర్చి మీరు దుఃఖించకండి. మీ హృదయాలు కలత చెందరాదు. ఎందుకనగా మీరు రెండవ శక్తిని చూడటము కూడా అనివార్యము. దాని రాక మీ కొరకు చాలా ఉత్తమమైనది. ఎందుకనగా అది శాశ్వతమైనది, అది ప్రళయ దినము వరకు ఉంటుంది. అయితే నేను వెళ్ళనంతవరకు ఆ రెండవ శక్తి వెలువడదు. నేను వెళ్ళిన తరువాత అల్లాహ్ ఆ ద్వితీయ సృష్టిని మీ కొరకు పంపిస్తాడు. అది ఎల్లప్పుడు మీతో

ఉంటుంది. ఈ దైవ వాగ్దానము **బరాహీనే అహ్మదియ్యా**లో గలదు. ఆ వాగ్దానము నాకు సంబంధించినది కాదు. మీకు సంబంధించిన వాగ్దానమది. నేను, నీ అనుయాయులు గల ఈ సంఘానికి ప్రళయ దినము వరకు ఇతరులపై ఆధిక్యత ప్రసాదిస్తానని అల్లాహ్ తెల్పినాడు. కావున మీపై నా ఎడబాటు దినము తప్పక వస్తుంది. ఆ తరువాత శాశ్వత వాగ్దాన దినము వెలువడును. మన అల్లాహ్ సత్యవాగ్దానములు చేయువాడు, విశ్వాసవంతుడు మరియు సత్యమైన అల్లాహ్. అతడు మీతో చేసిన వాగ్దానాలన్నింటినీ పూర్తి చేస్తాడు. ఇవి ప్రపంచ అంతిమ దినములు, ఎన్నో ఆపదలు సంభవించు సమయమిది అయినను దేవుడు చేసిన వాగ్దానములన్నీ పూర్తి అయ్యే వరకు ఈ ప్రపంచము అంతము కాదు. నేను అల్లాహ్ వైపు నుండి ఒక శక్తి రూపములో అవతరించాను, నేను అల్లాహ్ వైపు నుండి శరీర ఆకృతి దాల్చిన ఒక సంపూర్ణ దైవ శక్తిని, నా తరువాత మరికొందరు అవతరిస్తారు. వారు ద్వితీయ శక్తిని ప్రదర్శిస్తారు. కావున మీరందరు అల్లాహ్ ద్వితీయ శక్తి కొరకు ఏకమై ప్రార్థనలు చేయండి. ప్రతి దేశంలోని పుణ్యపురుషులందరూ ఏకమై రెండవ దైవ శక్తి ఆకాశం నుండి  అవతరించవలెనని, మీ అల్లాహ్ ఎంత శక్తి గలవాడో మీకు చూపవలెనని ప్రార్థనలు చేయవలెను. మీరు, మీ మరణము దగ్గరగా వుందని భావించండి. ఏ సమయంలో ఆ ఘడియ వచ్చునో మీకు తెలియదు.

నా తరువాత సంఘంలో పవిత్రాత్మగల గొప్పవారు నా పేరున ప్రజలతో బైఅత్ (ప్రతిజ్ఞ) తీసుకొనవలెను. ☆ భూమి పై

☆ అలాంటి వారి ఎన్నిక విశ్వాసపరుల ఏకాభిప్రాయముతో జరుగును. నలుబది (40) మంది విశ్వాసులు ఏ వ్యక్తినైతే నా పేరు మీద ప్రజలతో బైఅత్ (ప్రతిజ్ఞ) తీసుకొనుటకు అర్హుడని ఏకీభవిస్తారో, అతడు బైఅత్

ఆసియా, ఐరోపా వివిధ దేశాలలో నివసించే పవిత్ర స్వభావము గల ఆత్మలను ఏకత్వవాదము వైపు ఆకర్శించవలెనని తన దాసులను ఒకే ధర్మముపై ప్రోగు చేయవలెనని అల్లాహ్ కోరుచున్నాడు. ఇదే అతని లక్ష్యము. దీని కొరకే నేను ప్రపంచములో పంపబడ్డాను. కావున మీరు సున్నితంగా, సద్గుణాలతో ప్రార్థనలు సలుపుకుంటూ ఈ లక్ష్యాన్ని అనుసరించండి. నా తరువాత ఎవరైనా దేవునితో పరిశుద్ధాత్మ పొంది నిలబడే వరకు అందరు కలిసి సమిష్టిగా కృషి చేయండి.

మీరు కూడ సానుభూతి మరియు తమ ఆత్మలను పరిశుభ్రము చేసుకొని పరిశుద్ధాత్మను పొందవలెను. పరిశుద్ధాత్మ లేకుండా నిజమైన భక్తిని పొందలేరు. కామోద్రేకములను పూర్తిగా వదిలి, అల్లాహ్ ప్రీతి కొరకు అన్నిటికంటే ఇరుకైన దారిని ఎంచుకోండి. ప్రపంచ అభిరుచులకు ఆకర్షితులు కాకండి, అవి అల్లాహ్ నుండి దూరము చేస్తాయి. అల్లాహ్ కొరకు కఠిన జీవితాన్ని అవలంభించండి.

---

తీసుకొనేందుకు యోగ్యుడవుతాడు. అతడు తనను ఇతరులకు ఆదర్శమూర్తిగా మార్చుకోవాలి. నేను నీ సంఘము కొరకు నీ వంశము నుండే ఒక వ్యక్తిని నియమించుదునని, అతనిని నా సామీప్యముతో, సువార్తావాణితో విశిష్టపరిచెదనని అల్లాహ్ నాకు ఉపదేశించినాడు అతని ద్వారా ధర్మము అభివృద్ధి చెంది, అనేక మంది సత్యాన్ని స్వీకరిస్తారు. కావును ఆ రోజుల కోసం నిరీక్షించుము. ప్రతి వ్యక్తి తన కాలంలోనే గుర్తించబడుతాడని మీరు గ్రహించాలి. ఎలాగైతే ఒక పరిపూర్ణ మానవుడయ్యేవాడు కూడ సమయం కంటే ముందు గర్భములో ఇంద్రియము లేదా అంటుకొను పదార్థ రూపములో వుంటాడు. అలాగే సమయానికి ముందు వారు కూడా ఒక సామాన్య మానవుని వలే కనిపిస్తారు, లేదా కొన్ని పొరపాటు ఆలోచనల వలన అపవాదులుగా కనిపిస్తారు. (సమాప్తం)

అల్లాహ్ అసంతృప్తిపడు ఆ అభిరుచి కంటే అల్లాహ్ ఇష్టపడు ఆ బాధ చాలా ఉత్తమమైనది. అల్లాహ్ ఆగ్రహానికి గురిచేసే విజయాని కంటే అల్లాహ్ ఇష్టపడు ఆ అపజయం చాలా మేలైనది. అల్లాహ్ క్రోధమునకు గురి చేసే ప్రేమను విడనాడవలెను. మీరు సహృదయముతో అతని వైపు వచ్చినచో ప్రతి రంగములో అతడు మీకు సహకరించును. ఏ శత్రువు మీకు హాని కల్గించలేడు. మీరు అతని మార్గములో మీ ఇష్టాన్ని, అభిరుచులను, గౌరవాన్ని, ధనాన్ని, ప్రాణాన్ని వదులుకొని మరణ దృశ్యాన్ని మీ ముందు ప్రదర్శించు చేదును అనుభవించనిదే మీరు అల్లాహ్ ప్రీతిని అస్సలు పొందలేరు. మీరు ఆపదలను భరిస్తే ప్రియమైన శిశువు వలే అల్లాహ్ ఒడిలోకి వస్తారు. అప్పుడు మీరు పూర్వము గతించిన సత్యమూర్తుల వారసులుగా జేయబడుదురు. ప్రతి అనుగ్రహ ద్వారము మీ కొరకు తెరవబడుతుంది. కాని ఇలాంటి వారు కొందరే గలరు. దైవ భక్తి హృదయంలో నాటుకోవలసిన ఒక వృక్షం లాంటిదని దేవుడు నాకు ఆజ్ఞాపించినాడు. దైవ భక్తిని పోషించు నీరు వనమంత జలమయము చేయును. దైవ భక్తే మూలము. అది లేనిచో అంతా వ్యర్థమే. అదియున్నచో సమస్తము ఉన్నట్లే. సత్పదమునవలంభించక ఒట్టి మాటలతో దైవాన్వేషణ చేసే మానవునికి కలిగే లాభం ఏమిటి?. శ్రద్ధగా వినండి! నేను మీకు వాస్తవము చెప్పుచున్నాను, ధర్మముతో పాటు లౌకిక కాంక్షలు గలవాడు నాశనమవుతాడు. ఏ ఆత్మ ఉద్దేశాలన్ని పూర్తిగా అల్లాహ్‌కే పరిమితం గాక కొన్ని అల్లాహ్ కొరకు, మరికొన్ని ప్రపంచము కొరకు గల వానికి నరకము చాలా సమీపములో గలదు. కావున మీ ఉద్దేశాలలో ఏ మాత్రము లౌకిక కాంక్షలు వున్నా మీ ప్రార్థనలన్ని వ్యర్థమే. ఇటులున్నచో మీరు అల్లాహ్‌ను అనుసరించేవారు కారు, షైతాన్‌ను అనుసరించే

వారవుతారు. అప్పుడు అల్లాహ్ మీకు సహకరిస్తాడని మీరు ఆశించకండి. ఇలాంటి స్థితిలో మీరు భూమిలోని కీటకముల లాంటి వారు, కీటకాల వలే మీరు కూడ కొద్ది రోజుల్లోనే నాశనమవుతారు. మీలో దైవముండదు. మిమ్మల్ని నాశనము చేసి అల్లాహ్ సంతోషపడుతాడు. మీరు వాస్తవముగా మీ కోరికలను చంపుకుంటే అల్లాహ్ మీలో ప్రత్యక్షమై మీ వెన్నంటే ఉంటాడు. మీరు నివసించు గృహము శుభములు గలదగును, మీ గృహముల గోడలపై అల్లాహ్ అనుగ్రహము అవతరించును. ఇలాంటి వ్యక్తి నివసించు పట్టణము శుభదాయకమవుతుంది. మీ జీవితము, మీ మరణము, మీ ప్రతి కదలిక, మీ సున్నితత్వము, మీ ఉద్రేకము కేవలము అల్లాహ్ కొరకు అయినచో మరియు కష్ట, దుఃఖ అన్ని సమయాలలో మీరు అల్లాహ్‌ను పరీక్షించకుండా, ఆయనతో మీ బంధాన్ని త్రుంచకుండా ముందడుగు వేసినచో మీరు అల్లాహ్ ప్రత్యేక జాతిగా రూపు దిద్దుకుంటారని నేను ఎంతో స్పష్టంగా చెబుతున్నాను. నా మాదిరిగా మీరు కూడా మానవులే, నా అల్లాహ్‌యే మీ అల్లాహ్. కావున మీ పవిత్ర శక్తులను వృధా చేసుకోకండి. మీరు పూర్తిగా అల్లాహ్ ముందు మోకరిల్లినచో మీరు దైవ శ్రేష్టమైన జాతిగా మారుతారని నేను మీకు దైవ ఇష్టానుసారము గా చెబుతున్నాను. దైవ వైభవాన్ని మీ హృదయాలలో నిల్పుకోండి. అతని ఏకత్వవాదాన్ని కేవలము మాటలలో గాక ఆచరణలో చూపితే అల్లాహ్ కూడా తన కరుణ, కటాక్షాలను మీపై ప్రదర్శిస్తాడు. మానవ జాతితో స్వచ్ఛమైన సానుభూతితో ప్రవర్తించండి. కపటాన్ని ప్రదర్శించకండి. ప్రతి సన్మార్గాన్ని అనుసరించండి, మీరు ఏ మార్గము ద్వారా స్వీకరించబడుతారో తెలియదు.

మీకు శుభవార్త, దైవ సన్నిధి పొందే మైదానము ఖాళీగా వుంది. ప్రతి జాతి ప్రపంచాన్నే ప్రేమిస్తున్నది. అల్లాహ్ ఇష్టపడు విషయాల వైపు ప్రపంచ దృష్టి లేదు. ఎవరైతే సర్వశక్తులను ఉపయోగించి ఈ ద్వారములో ప్రవేశించగోరుదురో వారు తమ ప్రతిభను చూపి అల్లాహ్ నుండి విశేషమైన బహుమతులు పొందే సమయమిది. దేవుడు మిమ్ములను వ్యర్థముగా వదిలేస్తాడని అనుకోవద్దు. మీరు నిజానికి అల్లాహ్ భూమిలో విత్తిన బీజము. ఈ బీజము మొలకెత్తునని, అభివృద్ధి చెందునని, అన్ని వైపుల శాఖోపశాఖలుగా వ్యాపించి ఒక మహా వృక్షముగా రూపొందునని అల్లాహ్ ఉపదేశిస్తున్నాడు. కావున దైవ వాక్కును విశ్వసించి మధ్యలో సంభవించు ఆపదలకు భయపడనివారు ధన్యులు. ఆపదలు సంభవించడము కూడా అనివార్యము, తద్వారా తమ బైఅత్ ప్రతిజ్ఞలో సత్యాసత్యులెవరో అల్లాహ్ మిమ్ము పరీక్షించును. పరీక్షా సమయంలో తడబడువాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కల్గించ లేడు. దురదృష్టం అతన్ని నరకానికి చేర్చును. అతడు జన్మించి వుండకుంటే అతనికే బాగుండేది. ఎవరైతే అష్టకష్టాలు, ఆపదలను ఎదుర్కొంటారో, వివిధ జాతులు ఎవరినైతే అపహసిస్తాయో, ప్రపంచము ఎవరితో అసహ్యముగా వ్యవహరిస్తుందో, ఎవరైతే చివరి వరకు సహనము కనబర్చుతారో తుదకు వారే విజయాన్ని సాధిస్తారు. అనుగ్రహ ద్వారములు వారిపై తెరువబడుతాయి. నేను నా అనుయాయులకు తెలుపవలెనని అల్లాహ్ తఆలా నన్నుద్దేశించి ఇలా తెల్పినాడు. లౌకిక కాంక్ష, దాంభికము, పిరికితనము లేని, సంపూర్ణ విధేయత కల్గిన విశ్వాసము పొందినవారు అల్లాహ్‌కు ప్రీతి పాత్రులు. ఇలాంటి వారి అడుగులు సత్యమైనవని అల్లాహ్ ఉపదేశిస్తున్నాడు.

శ్రద్ధగా వినండి! అల్లాహ్ మీతో ఏమి కోరుచున్నాడు? మీరు అతన్నే విశ్వసించండి మరియు భూమ్యాకాశాలలో అతనికి ఎవ్వరిని సమానులుగా చేయకండి. మన అల్లాహ్ పూర్వం లాగా ఇప్పుడు కూడా సజీవముగానే వున్నాడు. అతడు గతంలో మాట్లాడినట్లుగానే ఇప్పుడు కూడా మాట్లాడుతాడు. అతడు పూర్వము వినునట్లుగానే నేడు కూడా వింటాడు. ఈ కాలంలో అతడు వింటాడే తప్ప మాట్లాడనే భావన వ్యర్థమైనది. నిజానికి అతడు వింటాడు మరియు మాట్లాడుతాడు కూడా, అతడి సర్వ లక్షణాలు శాశ్వతమైనవి. ఏ లక్షణము భగ్నము కాలేదు, ఎన్నడు కాదు కూడా. అతనికి భాగస్వామి ఎవ్వరూ లేరు. అతనికి సంతానము లేదు, భార్య లేదు. అతడు నిరుపమానమైనవాడు అతడికి సాటి ఎవ్వరూ లేరు. అతనిలా ఏ ఒక్కరు విశేషమైన లక్షణముతో ప్రత్యేకింపబడలేదు. సమానలు ఎవ్వరూ లేరు. అతనికి గల లక్షణాలు మరెవ్వరికి లేవు. అతడు ఏ శక్తిలో బలహీనుడు కాడు. అతడు దూరంగా ఉన్నప్పటికి సమీపంలో వున్నాడు. అతడు సమీపంగా ఉన్నప్పటికి దూరమున్నాడు. అతడు సామ్యరూపములో తన అస్థిత్వాన్ని మహాత్ములపై బహిరంగపరచును. కాని అతనికి ఎలాంటి శరీరము, ఆకారము లేదు. అతడు అందరికంటే ఉన్నత స్థాయి కలవాడు, అయినా అతని క్రింది స్థాయిలో మరొకరు గలరని చెప్పడానికి వీలులేదు. అతడు ఆకాశంలో సింహాసనాన్ని అధిష్టించి వున్నాడు, అయినా భూఉపరితలముపై లేదని చెప్పలేము. సంపూర్ణ లక్షణాలన్ని అతనిలో గలవు. ప్రశంసా పాత్రములైన సద్గుణాలన్ని అతనిలో మూర్తీభవించి ఉన్నాయి. శ్రేష్ఠత్వములకు అతడే మూలము. అతడు సర్వశక్తుల సముదాయము, సర్వ అనుగ్రహములకు నిలయము. అతడే ప్రతిదానికి నిలయము.

ప్రతి దేశానికి అధికారి అతడే, ప్రావీణ్యతలన్ని అతడిలో ఇమిడి ఉన్నాయి. అతడు నిష్కలంకుడు, ఏ దౌర్బల్యము లేనివాడు. భూమ్యాకాశములలో నివసించు వారందరు అతడినే ఆరాధించడము ప్రత్యేకమైన విషయము. అతని ముందు అసాధ్యమైనది ఏది లేదు. అన్ని ఆత్మలు, వాటి శక్తులు, సర్వ గ్రహములు, వాటి శక్తులు అతడు ఏర్పరచినవే. తన సామర్థ్యముల ద్వారా, తన శక్తి ద్వారా తన చిహ్నముల ద్వారా తన అస్థిత్వాన్ని తానే ప్రదర్శింపజేయును. మనము వీటి ద్వారనే అతడిని పొందగలము. అతడు నిరంతరము సత్యవాదులపై తన ఉనికిని ప్రదర్శిస్తుంటాడు. తన శక్తులను వారికి చూపిస్తాడు. దీని ద్వారనే అతడు గుర్తించబడుతాడు. దీని ద్వారనే అతనికి ఇష్టమైన మార్గము గుర్తించబడుతుంది.

కనులు లేకుండానే అతడు చూడును. చెవులు లేకుండానే వినును. నాలుక లేకుండానే అతడు మాట్లాడుతాడు. అదే విధముగా శూన్యము నుండి సృష్టిని తెచ్చుట అతని పనే. మీరు స్వప్న దృశ్యాలలో చూసే విధముగానే ఏ పదార్థము లేకుండనే ఒక ప్రపంచాన్ని సృష్టిస్తాడు. ప్రతి నాశనమైనదానిని, అంతమైనదానిని ఉన్నట్లుగా చూపిస్తాడు. అతని శక్తులన్ని ఇదే విధముగా వుంటాయి. అతని శక్తులను నిరాకరించువాడు అజ్ఞాని. అతడి సూక్ష్మాతి సూక్ష్మమైన శక్తులను ఎరుగని వాడు అంధుడు. అతడు తన వైభవానికి వ్యతిరేకమైన, వాగ్దానములకు విరుద్దమైన అంశములు తప్ప అన్ని నెరవేర్చును, నెరవేర్చగలడు. అతడు తన స్వభావములో, సద్గుణములలో, తన కార్యములలో, తన శక్తులలో అద్వితీయుడు. అతడిని చేరుటకు పవిత్ర ఖుర్ఆన్ చూపిన మార్గము తప్ప అన్ని మార్గములు మూసి వున్నాయి. ఇంతకు పూర్వము గల ప్రవక్తృత్వముల, గ్రంథముల ప్రత్యేక అనుసరణ అవసరము లేదు.

ఎందుకనగా ముహమ్మదియ్య ప్రవక్తుత్వము వాటన్నిటిని కలుపుకొని, ఆవరించి యున్నది. ఇది తప్ప అన్ని మార్గాలు మూసియున్నాయి. అల్లాహ్ సన్నిధికి చేర్చే సర్వ యదార్థములు ఇందులో గలవు. దీని తరువాత మరొక నూతన యదార్థము ఆవిర్భవించదు, ఇంతకు ముందుగల యదార్థములన్ని ఇందులో గలవు. ఈ ప్రవక్తుత్వము రావడం వలన అన్ని ప్రవక్తుత్వములు అంతమైనవి. తప్పక ఇలా జరుగవలసిందే. ఎందుకనగా దేనికైతే ఆరంభము ఉంటుందో దానికి అంతము కూడా వుండును. అయినా ఈ ముహమ్మదియ్య ప్రవక్తుత్వము తన సహజమైన మేలు చేకూర్చుటలో తక్కువేమి కాదు. అన్ని ప్రవక్తుత్వముల కంటే అధిక మేలు దీనిలో గలదు. ఈ ప్రవక్తుత్వ అనుసరణ చాలా సులభ పద్ధతిలో దైవ సన్నిధికి చేర్చును, దీనిని అనుసరిస్తే అల్లాహ్ ప్రేమ, అతనితో సంభాషణ మరియు వరములు పూర్వము కంటే అధికముగా లభిస్తాయి. దీని సంపూర్ణ అనుయాయి కేవలము సందేశహరునిగానే పేర్కొనబడడు. ఎందుకనగా దీని వలన ముహమ్మదియ్య పరిపూర్ణ ప్రవక్తుత్వమునకు భంగము వాటిల్లుతుంది. నిశ్చయముగా ఉమ్మతి (తెగకు చెందినవాడు) మరియు సందేశహరుడు అను రెండు పదాలు అతనికి వర్తిస్తాయి. దీని వలన ముహమ్మదియ్య సంపూర్ణ ప్రవక్తుత్వమునకు భంగము వాటిల్లదు. ఎందుకనగా ఈ అనుగ్రహముతో ఆ ప్రవక్తుత్వపు కాంతి అధికముగా ప్రకాశించును. ☆ ఆ సంభాషణ తన స్థితి,

---

☆ ఇది గాక గుర్తుంచుకోవలసిన మరో విషయమేమనగా ధర్మ శాసన ప్రవక్తృత్వపు ద్వారము హ(జత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహివసల్లం తరువాత పూర్తిగా మూయబడినది. పవిత్ర ఖుర్ఆన్ తరువాత కొత్త

పరిమాణ రూపములో పరిపూర్ణ స్థాయికి చేరినప్పుడు, దానిలో ఎలాంటి మలినము, లోపము లేకుండా వుండి స్పష్టమైన రీతిలో గుప్త విషయాలతో కూడి వుండినచో వేరే పదాలలో అది ప్రవక్తుత్వము అనబడును. దీనిపై ప్రవక్తలందరు ఏకీభవించినారు.

كُنْتُمْ خَيْرَ اُمَّةٍ اُخْرِجَتْ لِلنَّاسِ (ఆలె ఇమ్రాన్–3:111)

అని అభివర్ణించబడిన జాతి.

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ - صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ

(అల్ ఫాతిహా–1:6,7)

అని దుఆ నేర్పించబడిన జాతి సభ్యులందరు ఈ ఉన్నతమైన అంతస్థు నుండి బహిష్కరించబడుట, ఏ ఒక్కరు కూడా ఈ అంతస్థును పొందలేడనుట అసాధ్యము. అటులైనచో ముహమ్మదియ్య ధర్మానికి లోపభూయిష్టమైన, అసంపూర్ణమైన మరియు అందరు అంధుల వలే నుండు దోషమేగాకా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సామర్థ్యముపై కళంకము వచ్చేది. వారి (స.అ) పవిత్ర శక్తిలో లోపమేర్పడేది. అలాగే ఐదు పర్యాయములు నమాజ్‌లో చదువుటకు బోధించిన ఆ దుఆ కూడా వృధా అయ్యేది. అంతేగాకుండా దీనికి రెండో వైపు ఈ లోపము కూడ వుండేది. ఈ ప్రావీణ్యత ఉమ్మత్ వ్యక్తికి ముహమ్మదియ్య ప్రవక్తృత్వపు కాంతి అనుసరణ లేకుండా ప్రత్యక్షముగా లభించినచో **ఖత్‌మే నబువ్వత్** అర్థము వ్యర్థమై వుండేది. కనుక ఈ రెండు లోపముల నుండి కాపాడుటకు, ప్రవక్త కొరకు ప్రాణాలర్పించుటలో ఉచ్ఛస్థితికి చేరిన వారికి, వారి మధ్య ఎట్టి

శాసనములు నేర్పు, పవిత్ర ఖుర్ఆన్ శాసనమును కొట్టివేయు మరియు దానిని ఖండించు మరే గ్రంథము లేదు. ఇది అంతిమ దినము వరకు అనుసరణీయము. (సమాప్తం)

ఆటంకము లేనివారికి, అనుసరణ, అనుకరణలో తమను తాము మరిచి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిలో అగుపడునట్లు మారిన వారికి అల్లాహ్ పవిత్ర, సంపూర్ణమైన మాటలతో సంబోధించెను. మరో వైపు వారికి ప్రవక్తల వలే సంపూర్ణ రీతిలో దైవ సంభాషణ అనుగ్రహము కలిగెను.

ఈ విధముగా కొందరు ఉమ్మతి అయినా కూడా ప్రవక్త బిరుదు పొందారు. ఎందుకనగా ఇలాంటి ప్రవక్తుత్వము ముహమ్మదియ్య ప్రవక్తుత్వము నుండి వేరుకాదు. ఆలోచించినచో అది ఒక నూతన రూపములో ప్రకాశించు ముహమ్మదియ్య ప్రవక్తుత్వమేనని అర్థమవుతుంది. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను గురించి నుడివిన 'నబియుల్లాహ్' 'వ ఇమాముకుమ్' అనగా అతడు ప్రవక్త మరియు ఉమ్మతి కూడా, ఈ వాక్యముల అర్థము కూడా ఇదే. ఇట్లుకానిచో ఇతరులకు ఇచట పాదము మోపుటకు స్థానము లేదు. ఈ సూక్ష్మాంశాన్ని అర్థము చేసుకొని నాశనము నుండి రక్షణ పొందేవారు ధన్యులు.

అల్లాహ్ ఈసా అలైహిస్సలాంకు మరణానిచ్చినాడని ఈ సూక్తి స్పష్టమైన సాక్ష్యాన్నిస్తున్నది. فَلَمَّا تَوَفَّيْتَنِىْ كُنْتَ اَنْتَ الرَّقِيْبَ عَلَيْهِمْ (అల్ మాయిదహ్-5:118) ఈ సూక్తికి సంబంధించిన సూక్తుల ఆధారముగా దీని అర్థమేమనగా అల్లాహ్ ప్రళయ దినమున యేసు క్రీస్తు (అ) ను నీవు నీ అనుయాయులకు నన్ను, నా తల్లిని దైవముగా భావించమని బోధించావా? అని ప్రశ్నించును. అప్పుడు వారు నేను వారిలో వున్నంత వరకు వారిని కనిపెట్టి ఉంటిని, కాని నీవు నా ఆత్మను వశపరుచుకున్న తరువాత వారు ఏ దుర్మార్గమును అవలంభించినారో నాకు తెలియదని జవాబు ఇస్తారు. ఎవరైన

فَلَمَّا تَوَفَّيْتَنِي సూక్తిని 'నీవు నాకు మరణమిచ్చినప్పుడు' అని అనువదించినను లేదా మొండితనమును వీడక 'నీవు నన్ను శరీరముతో ఆకాశం మీదికి లేపినప్పుడు' అని అనువదించినను, మొత్తం మీద హజ్రత్ యేసు క్రీస్తు (అ) ప్రపంచానికి మరల రారని ఈ సూక్తి ద్వారా ఋజువు అవుతుంది. అతడు అంతిమ దినము కంటే ముందు మరల ప్రపంచానికి వచ్చి వుంటే, శిలువను విరగ్గొట్టి వుంటే, దైవ ప్రవక్త అయిన ఈసా (అ) అంతిమ దినమున "నా మతస్తులు నా తరువాత నన్ను నా తల్లిని దైవముగా భావించినది నాకు ఏ మాత్రం తెలియదు" అని అల్లాహ్ ముందు ఇంత స్పష్టమైన అసత్యమాడటం అసాధ్యము. మరల ప్రపంచానికి వచ్చి నలుబది సం॥లు ప్రపంచములో గడిపి, క్రైస్తవులతో యుద్ధాలు చేసి, సందేశహరునిగా పిలువబడి 'నాకు ఏమి తెలియదని' ఇంత అసహ్యాకరమైన అబద్ధమాడగలరా? ఈసా (అ) రెండవ అవతరణను ఈ సూక్తి ఖండిస్తున్నది. లేనిచో వారు అసత్యవాదిగా పరిగణించబడుతారు. వారు శరీరముతో ఆకాశముపై వున్నచో, ఈ సూక్తి వివరణానుసారము ప్రళయ దినము వరకు భూమి మీదకు రాకపోతే వారు ఆకాశంలోనే మరణిస్తారా? వారి సమాధి ఆకాశంలోనే ఉంటుందా? కాని ఆకాశములో మరణించుట సూక్తి فِيهَا تَمُوتُونَ (అల్ ఆరాఫ్-7:26) కి వ్యతిరేకము. కావున దీనితో ఋజువయ్యేదేమనగా వారు శరీరముతో సహా ఆకాశమునకు వెళ్ళలేదు, మరణించి వెళ్ళినారు. అల్లాహ్ గ్రంథము ఇంత విపులముగా తీర్పు నిచ్చిన తరువాత కూడ అల్లాహ్ గ్రంథాన్ని వ్యతిరేకించడము అపరాధము కాక మరేమిటి?.

నేను రాకుండా వుండినచో అవగాహనరాహిత్యం క్షమించబడేది. కాని నేను దేవుని వైపు నుండి వచ్చిన తరువాత,

పవిత్ర ఖుర్ఆన్ నిజమైన, స్పష్టమైన భావము తెలిపిన తరువాత కూడా తప్పును వదలక పోవడం నీతి కాదు. నా కొరకు భూమ్యాకాశములలో అల్లాహ్ సంకేతములు బహిర్గతమైనవి. దాదాపు శతాబ్దపు నాల్గవ భాగము కూడా గడిచినది. వేల కొద్ది సంకేతములు ప్రత్యక్షమైనాయి. మరియు ప్రపంచ వయస్సు ఏడవ వెయ్యి ఆరంభమైన కూడా సత్యాన్ని గ్రహించనిచో ఇదెట్టి కఠినత్వమో? అల్లాహ్ సంకేతములు ఇంకా అంతము కాలేదని నేను గట్టిగా చెబుతున్నాను. 1905 ఏప్రిల్ 4వ తేదీన సంభవించిన ప్రథమ భూకంపపు వార్త చాలా ముందే ఇవ్వబడింది. తరువాత వసంత ఋతువులో మరల ఒక భారీ భూకంపము సంభవిస్తుందని దేవుడు నాకు వార్తనిచ్చాడు. వసంత ఋతువు ఆరంభములో చెట్లు అంకురించునప్పుడో, దాని మధ్య కాలంలోనో లేదా చివరి రోజుల్లోనో ఎప్పుడో తెలియదు. దైవవాణి పదాలు , $ **"మరల వసంతం వచ్చెను, దైవ వాక్కు మరల పూర్తయ్యెను"** ప్రథమ భూకంపము కూడా వసంత ఋతువులోనే సంభవించింది. కావున ద్వితీయ భూకంపము కూడా వసంత ఋతువులోనే సంభవించునని అల్లాహ్ నాకు తెల్పినాడు. జనవరి చివరలో కొన్ని చెట్లు అంకురించడము ఆరంభించును. అందువలన ఈ మాసము నుండే భయపడు దినములు ఆరంభమగును. ఈ దినములు దాదాపు మే నెల చివరి వరకు వుండును.☆

☆ వసంత ఋతువు రోజులనగా ఈ చలి కాలము తర్వాత వచ్చు వసంత కాలమో లేదా మరో వసంత కాలము ఈ భవిష్యవాణి పూర్తి అగు కాలమగునో నాకు తెలియదు. మొత్తం మీదా వసంత కాలమని దేవుని మాటల ద్వారా అర్థమగును. రాత్రి వేళ రహస్యముగా వచ్చు వ్యక్తి వలే దేవుడు వచ్చునని అల్లాహ్ నాతో నుడివెను. (సమాప్తం)

زَلْزَلَةُ السَّاعَةِ అనగా ఆ భూకంపము ప్రళయ దినమును పోలియుండునని అల్లాహ్ నుడివెను. మరల ఇట్లు నుడివెను, لَكَ نُرِيْ اٰيٰتٍ وَّنَهْدِمُ مَا يَعْمُرُوْنَ ☆ అనగా మేము నీ కొరకు సంకేతములు ప్రదర్శింతుము. నిర్మించుచుపోవు భవనములను మేము పడగొట్టుచు పోయెదము. మరల ఇట్లు నుడివెను. "తీవ్రమైన భూకంపము సంభవించెను, భూమిని తలక్రిందులుగా చేసెను." అనగా ఒక భారి భూకంపము సంభవించనున్నది. హజ్రత్ లూత్ కాలములో సంభవించినట్లుగా భూభాగములోని కొన్ని ప్రాంతాలను తలక్రిందులుగా చేయును. మరల ఇట్లు నుడివెను, اِنِّيْ مَعَ الْاَفْوَاجِ اٰتِيْكَ بَغْتَةً అనగా నేను మహా సైన్యముతో రహస్యముగా వచ్చెదను. లూత్ నగరము తలక్రిందులు చేయు వరకు ఎవరికి తెలియనట్లుగా ఆ దినమును గూర్చి ఎవరికి తెలియదు. అందరు తినుచు త్రాగుచు ఆనందముగా వుండేవారు అకస్మాత్తుగా భూమి తలక్రిందులుగా చేయబడినది. ఈ కాలములో కూడా ఆ విధముగనే జరుగునని అల్లాహ్ తెల్పినాడు. ఎందుకనగా పాపము హద్దులు మీరినది, మానవులు ప్రపంచాన్ని అతిగా ప్రేమిస్తున్నారు, దైవమార్గము చిన్నచూపుతో చూడబడుచున్నది. మళ్ళీ ఇలా తెల్పినాడు, "జీవితముల అంతము" మరల నన్నుద్దేశించి ఇలా సెలవిచ్చాడు.

قَالَ رَبُّكَ اِنَّهٗ نَازِلٌ مِّنَ السَّمَاءِ مَا يُرْضِيْكَ رَحْمَةً مِّنَّا - وَكَانَ اَمْرًا مَّقْضِيًّا

అనగా! నీ ప్రభువు ఇట్లనును, ఆకాశము నుండి ఒక ఆజ్ఞ దిగును దానితో నీవు సంతోషించెదవు. ఇది మా వైపు నుండి అనుగ్రహము. ఆరంభము నుండి తీర్మానించబడిన విషయమిది. ఈ భవిష్యత్ వాణి వివిధ జాతులలో ప్రకటితమగు వరకు ఆకాశము

☆ ఈ విషయములో అల్లాహ్ సువార్త వాణి ఇట్లు గలదు. "నీ కొరకు నా నామము ప్రకాశించెను."

ఈ విషయమును దింపుటకు తప్పక ఆగియుండును. మా మాటలను అదృష్టవంతుడు తప్ప మరెవడు విశ్వసించును.?

ఈ ప్రకటన కలతను వ్యాపింపజేయుటకు కాదు. అజ్ఞానములో ఎవరు నాశనము కాకూడదని రాబోవు కలత నుండి జాగ్రత్త పర్చుటకని గుర్తుంచుకోవాలి. ప్రతి విషయము సంకల్పము పై ఆధారపడి ఉంటుంది. కావున మా సంకల్పము దుఃఖము నుండి రక్షించుట. పశ్చాత్తాపము చెందినవారు దైవశిక్ష నుండి రక్షించబడుదురు. పశ్చాత్తాప పడక, పరిహాస సమావేశాలు వదలక, దుర్మార్గాన్ని, పాపాన్ని వీడని వాడు దురదృష్టవంతుడు. అతని నాశన దినములు సమీపించినవి. ఎందుకనగా అతని అహంకారము దైవ దృష్టిలో శిక్షార్హమైనది.

ఇచ్చట చర్చనీయాంశము మరొకటి గలదు. అల్లాహ్ నాకు నా మరణ వార్త నిచ్చినాడని నేను ముందే వివరించాను, నన్నుద్దేశించి నా జీవితమును గూర్చి అతి తక్కువ దినములు గలవని, అన్ని సంఘటనలు, ప్రకృతి వింతలు సంభవించిన తర్వాత నీ సంఘటన సంభవించునని నుడివెను. నా మరణమునకు ముందు ప్రపంచములో కొన్ని సంఘటనలు, కొన్ని ప్రకృతి వింతలు తప్పక బహిర్గతమగునని ఆ విప్లవము తర్వాత నాకు మరణము వచ్చునని కూడా దైవవాణీలు సూచిస్తున్నాయి. ఇది నీ సమాధి స్థానమని నాకు ఒక ప్రదేశము చూపబడినది. ఒక దేవదూత భూమిని కొలుస్తుండగా నేను చూసితిని. అతడు ఒక స్థలము వద్దకు చేరి ఇది నీ సమాధి స్థలమని నాకు చెప్పెను. మరో చోట ఒక సమాధి నాకు చూపించబడినది. అది వెండికంటే ఎక్కువే మెరియుచుండెను. దాని మట్టి అంతా వెండిదే. ఇది నీ సమాధి అని నాకు చెప్పబడినది. మరో ప్రదేశము నాకు చూపబడెను.

దానికి **బహిష్తీ మఖ్బరహ్** అని పేరు పెట్టబడింది. అవి స్వర్గార్హులైన నీతిమంతుల సమాధులని ప్రకటించబడినది. అప్పటి నుండి సంఘము కొరకు ఖబ్రిస్తాన్ నిమిత్తము కొంత భూభాగాన్ని కొనవలెనను ఆలోచన గలదు. కాని మంచి భూములకు ఎక్కువ ధర గలదు. కనుక ఈ ఆశయము సుదీర్ఘ కాలము వరకు వాయిదా పడింది. ఇప్పుడు నా సోదరులైన కీ॥ శే॥ మౌల్వీ అబ్దుల్ కరీమ్ గారి మరణము తరువాత, నా మరణము గూర్చి కూడా తరచుగా దైవవాణి అందడం వలన ఖబ్రిస్తాన్‌కు తొందర పడాలని నేను నిర్ణయించుకున్నాను. అందుచే వెయ్యి రూపాయలకు తక్కువ లేని మా తోట సమీపములో గల నా స్వంత భూమిని దీని కొరకు ప్రతిపాదించాను. అల్లాహ్ దీనినే **బహిష్తీ మఖ్బరహ్**గా చేసి శు భములు కలిగించవలెనని, వాస్తవముగా ప్రపంచము కంటే ధర్మమునకు ప్రాముఖ్యతనిచ్చి, ప్రపంచ ప్రేమను వదిలి, దేవునికే అంకితమై, తమలో పవిత్రమైన మార్పు తెచ్చుకొని, ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులవలే విశ్వాస, సత్య నిదర్శనములు ప్రదర్శించిన ఈ సంఘపు పవిత్ర హృదయుల శయనాగారము కావాలని నేను దుఆ చేస్తున్నాను. اٰمِیْن یَارَبَّ الْعَالَمِیْنَ- (ఆమీన్ యా రబ్బల్ ఆలమీన్)

మరల నీనిట్లు ప్రార్థిస్తున్నాను, ఓ సర్వశక్తులుగల నా అల్లాహ్! వాస్తవముగా నీకు అంకితమైన, తమ కార్యములలో ప్రపంచ కోరికలు లేని ఈ సంఘ పవిత్ర హృదయుల సమాధులుగా ఈ భూమిని చేయుము. اٰمِیْن یَارَبَّ الْعَالَمِیْنَ

మరల నేను మూడవ సారి ఇట్లు ప్రార్థిస్తున్నాను, ఓ సర్వశక్తులు గల అపారదయామయుడా! పరమ కారుణ్యమూర్తి, క్షమాగుణ ప్రపూర్ణుడా! నీ ఈ దూతను నిజముగా విశ్వసించి

ఎలాంటి కపటము, స్వార్థము మరియు అనుమానం ☆ తనలో లేనివారు, విశ్వాసము, విధేయతతో విధులను నిర్వర్తించువారికి, నీ కొరకు నీ మార్గములో ప్రాణాలర్పించు వారికి, నీవు ఇష్టపడిన

---

☆ అనుమానం ఒక కఠినమైన రోగం. ఇది మనిషి విశ్వాసాన్ని మహాగ్నిజ్వాల గడ్డి పరకను కాల్చినట్లు తొందరగా కాల్చి వేయును. దైవ ప్రవక్తలను అనుమానించు వానికి, అల్లాహ్ స్వయముగా శత్రువై తమ ప్రవక్తలను రక్షించుకోవడానికి ఉద్యుక్తుడగును. తమకు ప్రీతి పాత్రులైనవారి గౌరవాన్ని నిరుపమానమైన ప్రేమతో కాపాడుకుంటాడు. అందరికి అసూయ కలిగే విధముగా రక్షించుకుంటాడు. నాపై వివిధములైన దాడులు జరిగినప్పుడు ఆ అభిమానంతోనే అల్లాహ్ నన్ను సంరక్షించినాడు. అతడు ఇట్లు నుడివెను.

اِنِّیْ مَعَ الرَّسُوْلِ اَقُوْمُ ؕ وَاَلُوْمُ مَنْ یَّلُوْمُ۔ وَاُعْطِیْكَ مَایَدُوْمُ۔ لَكَ دَرَجَۃٌ فِی
السَّمَآءِ وَفِی الَّذِیْنَ هُمْ یُبْصِرُوْنَ۔وَلَكَ نُرِیَ اٰیٰتٍ وَنَهْدِمُ مَایَعْمُرُوْنَ۔ وَقَالُوْا
اَتَجْعَلُ فِیْهَا مَنْ یُّفْسِدُ فِیْهَا۔ قَالَ اِنِّیْ اَعْلَمُ مَالَا تَعْلَمُوْنَ۔ اِنِّیْ مُهِیْنٌ مَنْ اَرَادَ
اِهَانَتَكَ۔ لَا تَخَفْ اِنِّیْ لَا یَخَافُ لَدَیَّ الْمُرْسَلُوْنَ۔ اَتٰی اَمْرُ اللّٰهِ فَلَا تَسْتَعْجِلُوْهُ بِشَارَۃٌ
تَلَقَّا هَا النَّبِیُّوْنَ۔یَا اَحْمَدِیْ اَنْتَ مُرَادِیْ وَمَعِیْ۔اَنْتَ مِنِّیْ بِمَنْزِلَةِ تَوْحِیْدِیْ
وَتَفْرِیْدِیْ وَاَنْتَ مِنِّیْ بِمَنْزِلَةٍ لَا یَعْلَمُهَا الْخَلْقُ وَاَنْتَ وَجِیْهٌ فِیْ حَضْرَتِیْ اَخْتَرْتُكَ
لِنَفْسِیْ۔ اِذَا غَضِبْتَ غَضِبْتُ وَكُلَّمَا اَحْبَبْتَ اَحْبَبْتُ۔اٰثَرَكَ اللّٰهُ عَلٰی كُلِّ شَیْءٍ
اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ جَعَلَكَ الْمَسِیْحَ ابْنَ مَرْیَمَ ؕ۔ لَا یُسْئَلُ عَمَّا یَفْعَلُ وَهُمْ یُسْئَلُوْنَ۔
وَكَانَ وَعْدًا مَّفْعُوْلًا یَعْصِمُكَ اللّٰهُ مِنَ الْعِدَا۔وَیَسْطُوْ بِكُلِّ مَنْ سَطَا۔ذَالِكَ
بِمَا عَصَوْا وَّكَانُوْا یَعْتَدُوْنَ۔ اَلَیْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهٗ۔ یَا جِبَالُ اَوِّبِیْ مَعَهٗ وَالطَّیْرُ ؕ۔
كَتَبَ اللّٰهُ لَاَغْلِبَنَّ اَنَا وَرُسُلِیْ۔ وَهُمْ مِنْ بَعْدِ غَلَبِهِمْ سَیَغْلِبُوْنَ۔ اَنَّ اللّٰهَ مَعَ الَّذِیْنَ
اتَّقَوْا وَالَّذِیْنَ هُمْ مُّحْسِنُوْنَ۔ اِنَّ الَّذِیْنَ اٰمَنُوْا اَنَّ لَهُمْ قَدَمَ صِدْقٍ عِنْدَ رَبِّهِمْ۔
سَلَامٌ قَوْلًا مِّنْ رَّبٍّ رَّحِیْمٍ وَامْتَازُوا الْیَوْمَ اَیُّهَا الْمُجْرِمُوْنَ ؕ۔منه

వారికి, నీ ప్రేమలో పూర్తిగా లీనమై నీ దూతతో విధేయత, సభ్యత స్పష్టమైన విశ్వాసముతో ప్రేమ, శ్రద్ధా పరాయణత సంబంధము కల్గిన వారికి ఇచ్చట సమాధులకు స్థానము నొసంగుము. اٰمِیْن یَارَبَّ الْعَالَمِیْنَ

ఈ ఖబ్రిస్తాన్ గూర్చి చాలా గొప్ప శుభవార్తలు నాకు అందినవి. అల్లాహ్ ఈ ఖబ్రిస్తాన్‌ను స్వర్గము అని పేర్కొనడమేగాక ఇట్లు సెలవిచ్చాడు. اُنْزِلَ فِیْهَا کُلُّ رَحْمَةٍ అనగా ప్రతి అనుగ్రహము ఈ స్మశానములో అవతరింపబడినది. ఈ స్మశానములో సమాధి అయిన ప్రతివారికి భాగ్యము లేని అనుగ్రహము లేదు. కనుక అల్లాహ్ ఇట్టి స్మశానము కొరకు కొన్ని నిబంధనలు నియమించాలని నా మనస్సునకు ఇట్లు సువార్త నంపెను. నిజాయితి, సంపూర్ణ సరళత్వముతో ఆ నిబంధనలను పాటించువారే దీనిలో చేరగలరు. కావున ఈ క్రింది మూడు నిబంధనలను అందరు పాటించవలసిందే.

(1) (ప్రథమ నిబంధన):- ప్రస్తుతము గల ఈ ఖబ్రిస్తాన్ భూమిని నేను నా తరపున చందా రూపములో ఇచ్చినాను. కాని దీని ఆవరణాన్ని పూర్తి చేయుటకు మరికొంత భూమి కొనుగోలు చేయబడును. దీనికి ధర దాదాపు వెయ్యి రూపాయలు అగును. దీనిని అందముగా తీర్చి దిద్దుటకు కొన్ని వృక్షములు నాటబడును. ఒక బావి ఏర్పాటు చేయబడును. దీనికి ఉత్తర దిశలో ప్రవేశ ద్వారము వద్ద చాలా నీరు ఆగి ఉంటున్నది. అందుచే ఇచట ఒక వంతెన నిర్మించ బడును. ఇలాంటి వివిధ ఖర్చుల కోసం రెండు వేల రూపాయలు కావలసి ఉంటుంది. కావున ఈ పనిని పూర్తి చెయ్యడానికి మొత్తం మూడు వేల రూపాయలు ఖర్చు అవుతాయి. అందువలన మొదటి నిబంధన ఏమనగా ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి కావాలని కోరుకునే ప్రతి వ్యక్తి తన సామర్థ్యానుసారము ఈ

వ్యయముల కొరకు చందా ఇవ్వవలెను. ఈ చందా కేవలము ఇలాంటి వారి నుండే తీసుకొనబడును. ఈ చందా ప్రస్తుతము మౌల్వీ నూరుద్దీన్ సాహిబ్ వద్దకు రావలెను. అల్లాహ్ కోరినచో ఈ పద్ధతి మనందరి మరణము తరువాత కూడ కొనసాగును. అందువలన అప్పుడప్పుడు సమకూర్చుకున్న ఆదాయాన్ని ఇస్లాం అభివృద్ధి కార్యకలాపాలకై, ఏకేశ్వర సిద్ధాంత ప్రచారానికై అవసరమైన రీతిలో ఖర్చు చేయుటకు ఒక సమితి ఏర్పాటు చేయవలెను.

(2) ద్వితీయ నిబంధన:- సంఘ సభ్యులందరిలో ఎవరైతే తమ మరణానంతరము నిర్ణీత సూచనల ప్రకారము తమ మొత్తం ఆస్తి నుండి పదవ భాగము ఇస్లాం వ్యాప్తికై, ఖుర్ఆన్ ఆదేశాల ప్రచారములో వెచ్చించుటకు ఇస్తానని వీలునామ వ్రాసిస్తారో అలాంటి వారు మాత్రమే ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి చేయబడుదురు. ప్రతి సత్యవంతుడు, విశ్వాస పరుడు తమ వీలునామలో ఇంతకన్న ఎక్కువ కూడ వ్రాయవచ్చును, కాని ఇంతకంటే తక్కువ కాదు. ఈ సంపద ఒక విశ్వసనీయత, వివేకము గల సమితికి అప్పగించబడును. వీరు పరస్పర సలహాలతో ఇస్లాం అభివృద్ధి కొరకు, ఖుర్ఆన్ జ్ఞానము, ధార్మిక గ్రంథాల ప్రచురణ కొరకు, ఈ సంఘ బోధకుల కొరకు ఖర్చు చేయుదురు. ఈ సంఘమును అభివృద్ధి పరుస్తానని అల్లాహ్ వాగ్దానము గలదు. అందువలన ఇస్లాం ప్రచురణకు అవసరమయ్యే చాలా ధనము కూడ ప్రోగు అగునని ఆశించవచ్చును. ఇస్లాం ప్రచారానికి సంబంధించిన పనులన్ని ఈ ధనముతోనే పూర్తి చేయబడుతాయి. ఆ కార్యములను వివరించుటకు సమయము కాదిది. ఈ వ్యవస్థను నిర్వహించువారు మరణించినచో వారి ప్రాతినిధ్యములో నియమించబడువారు కూడ

అహ్మదియ్య సంఘ సూచనల ప్రకారము అన్ని సేవలను నిర్వర్తించుట అనివార్యమగును. అహ్మదియ్య సంఘములో గల జీవనోపాధి లేని అనాథలకు, బీదలకు, నవ ముస్లింలకు కూడా ఈ ఆదాయములో హక్కు ఉంటుంది. ఈ ధనమును వ్యాపారము ద్వారా అభివృద్ధి చేయుట ధర్మబద్ధము. ఇవి కేవలము ఊహకందని విషయాలని భావించకుము. ఇది భూమ్యాకాశముల చక్రవర్తి అయిన శక్తిమంతుని సంకల్పము. ఈ ధనమెట్లు ప్రోగగునని, నీతి నిజాయితితో ఈ కార్యమొనరించు సంఘమెట్లు జనించునని కాని నాకు చింత లేదు. కాని మా తరువాత ఈ ధనము అప్పగించబడిన వారు అధిక సంపదను చూసి తప్పటడుగు లేస్తారేమోనని, ప్రపంచాన్ని ప్రేమిస్తారేమోనని నాకు చింత గలదు. కావున అల్లాహ్ కొరకు పని చేయు సత్యవంతులు నిరంతరము ఈ సంఘములో జన్మించాలని నేను ప్రార్థిస్తున్నాను. జీవనాధారము లేని వారికి సహకారముగా ఇందులో నుండి కొంత ఇవ్వడము ధర్మము.

(3) తృతీయ నిబంధన:- ఈ ఖబ్రిస్తాన్ నందు సామాధి అయ్యేవ్యక్తి ధర్మనిష్టాపరుడై వుండాలి, నిషేధించిన వాటి నుండి, విగ్రహారాధనకు, దురాచారాలకు దూరముగా వుండాలి. సత్యమైన, స్వచ్ఛమైన ముస్లింగా వుండాలి.

(4) (చతుర్థ నిబంధన): ఆస్తి పాస్తులు లేనివారు, ధన సహాయము చేయలేని ప్రతి సత్పురుషుడు తన జీవితాన్ని ధర్మము కొరకు అంకితము చేశాడని, నీతి గల వాడని నిరూపణ అయినచో అతన్ని ఈ ఖబ్రిస్తాన్ లో సమాధి చేయవచ్చును.

# సూచనలు

1. పైన పేర్కొనబడిన నిబంధనల ప్రకారము ఎవరైన వీలునామా వ్రాయదలచినచో వారి మరణము తర్వాత వారి వీలునామా ప్రకారము నడుచుకోవడం జరుగుతుంది. కాని వీలునామా వ్రాసి ఈ బాధ్యతలు నిర్వహించే కార్యదర్శికి పంపడము, ప్రచురించడము అనివార్యము. ఎందుకనగా తరచుగా మరణ సమయంలో వీలునామాలు వ్రాయుట కష్టతరము. ఆకాశ సంకేతములు, ప్రమాదాల దినములు సమీపములో గలవు, కావున ఆరోగ్యకర సమయంలో వీలునామా వ్రాయు వారి స్థానము దైవ దృష్టిలో చాలా మహోన్నతమైనది. దీర్ఘకాలముపయోగపడు ధనాన్ని వీలునామాలో వ్రాయుట వలన దీర్ఘకాలము వరకు పుణ్యము లభించును. శాశ్వత దాన ధర్మములు చేయడమగును.

2. ఇతర ప్రాంతములో ఉండేవారు, అనగా ఖాదియాన్ నుండి దూరముగా ఈ దేశ ఇతర ప్రాంతములో నివసించేవారు సూచించిన నిబంధనలను పాటించిన వారైతే వారి మరణానంతరము వారి వారసులు వారి పార్థివదేహాన్ని ఒక పెట్టెలో భద్రపరిచి ఖాదియాన్ కు చేర్చవలెను. ఈ ఖబ్రిస్తాన్ పూర్తిగా సిద్ధం కాకముందే అనగా వంతెన మొ॥ నవి నిర్మించక ముందే నిబంధనల ప్రకారము ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి అయ్యేవారు ఎవరైన మరణిస్తే తాత్కాలికంగా ఒక పెట్టెలో సురక్షితముగా భద్రపరిచి తమ ప్రదేశములో సమాధి చేయవలెను. ఖబ్రిస్తాన్ పనులన్ని పూర్తి అయిన పిదప వారి పార్థివ దేహాన్ని ఖాదియాన్‌కు తీసుకొనిరావలెను. కాని పెట్టె లేకుండా సమాధి నుండి బయటికి తీయడము మంచిది కాదు. ☆

☆ అజ్ఞానముతో ఈ ఖబరస్తాన్ ను, ఈ పద్దతిని దురాచారముగా భావించరాదు.

గుర్తుంచుకోవలసినదేమనగా సంపూర్ణ విశ్వాసులందరు ఒకే ప్రదేశములో సమాధి కావాలని అల్లాహ్ కోరిక. తద్వారా రాబోవు తరాలు, వారందరిని ఒకే ప్రదేశములో చూసి తమ విశ్వాసాన్ని ధృఢపర్చుకొందురు. వారు అల్లాహ్ కొరకు చేసిన ధార్మిక పనులు నిరంతరము జాతికి తెలియుచుండును.

అంతిమంగా ప్రార్థించడమేమనగా అల్లాహ్ ఈ కార్యములో ప్రతి నీతిమంతుడికి సహాయపడుగాక! వారి విశ్వాసమును పెంపొందించుగాక! వారి అంతము ఉత్తమమగుగాక! ఆమీన్

మన సంఘములో ఈ రచనలు పొందిన వారందరు దీనిని తమ మిత్రులలో ప్రకటించడము ఉత్తమము. సాధ్యమైనంత వరకు దీనిని ప్రచురించవలెను. తమ రాబోవు తరాల కొరకు దీనిని భద్రపర్చవలెను. వ్యతిరేకులకు కూడ దీనిని సంస్కార పద్ధతిలో తెలియపర్చవలెను. ప్రతి దుర్మార్గుడి చాడీలను సహించవలెను. ప్రార్థనలో లీనమై వుండాలి.

وَآخِرُ دَعْوَانَا اَنِ الْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ

రచయిత

మీ విధేయుడు

అల్ ముష్తకర్ ఇలల్లాహిస్సమద్

గులాం అహ్మద్ ఆఫాహుల్లాహు వ అయ్యద్

20 డిసెంబరు, 1905.

---

ఎందుకనగా ఈ ఏర్పాటు దైవవాణి ప్రకారముగా జరుగుచున్నది. ఇందులో మానవుని ప్రమేయం లేదు. ఈ ఖబరస్తాన్ లో సమాధి అయిన వారు స్వర్గవాసులెలా అవుతారని ఎవరూ ఆలోచించరాదు. ఈ భూమి ఎవరినైన స్వర్గవాసి చేయునని దీని అర్థము కాదు, అల్లాహ్ వాక్యముల అర్థమేమనగా కేవలము స్వర్గస్తులే దీనిలో సమాధి యగుదురు.

# ఫార్సి పద్యము ఫార్సి భాషలో

الاآ اے کہ ہشیاری و پاک زاد　　پۓ حرص دنیا مدہ دیں بباد
بدیں دارِ فانی دل خود مبند　　کہ دارد نہاں راحتش صد گزند
اگر باز باشد ترا گوشِ ہوش　　زِگورت ندائے درآید بگوش
کہ اے طعمۂ من پس از چند روز　　پۓ فکر دنیائے دوں کم بسوز
ہراں کو بدنیائے دوں مبتلا است　　گرفتارِ رنج و عذاب و عنا است
برست آنکہ برموت دارد نگاہ　　بریدہ زِ دنیا، دو دیدہ براہ
سفر کردہ پیش از سفر سوئے یار　　کشیدہ زِ دنیا ہمہ رخت و بار
پۓ دار عُقبی کمر بستہ چُست　　رہا کردہ سامانِ ایں خانہ سُست
چوکارِ حیات است کارے نہاں　　ہماں بہ کہ دل بگسلی زیں مکاں
جہنم کزو داد فرقاں خبر　　ہمیں حرص دنیا است جانِ پدر
چو آخر زِ دنیا سفر کردن است　　چوروزے ازیں رہ گذر کردن است
چرا عاقلے دل بہ بندد دراں　　کہ ناگہ وزد بر گُلِ او خزاں
بدیں قحبہ بستن دلِ خود خطا است　　کہ این دشمنِ دین وصدق وصفا است
چہ حاصل ازیں دلستانِ دو رنگ　　کہ گاہے بصلحت کُشدگہ بجنگ
چرا دل نہ بندی بداں دلستاں　　کہ مہرش رہاند زِ بندِ گراں
برو فکرِ انجام کن اے غوی　　زِ سعدی شنو گر زِ من نشنوی

عروسی بود نوبتِ ماتمت
اگر برنکوئی بود خاتمت

# ఫార్సి పద్యము తెలుగు లిపిలో

1. అలా ఏ కె హుష్యారి వ పాక్ జాద్
పే హిరస్ దున్యా మదన్ దేఁ బబాద్

2. బదీఁ దార్ ఫాని దిలే ఖుద్ మబంద్
కె వారిద్ నిహాఁ రాహ్తష్ సద్ గజంద్

3. అగర్ బాజ్ బాషద్ తురా గౌషే హెూష్
జిగరోత్ నిదాయే దర్ఆయద్ బగోష్

4. కె ఏ తామ్ఏ మన్ పస్ అజ్ చంద్ రోజ్
పయే ఫిక్రె దున్యాయే దూఁ కమ్ జిసోజ్

5. హర్ ఆఁ కూ బదున్యాయే దూఁ ముబ్తిలా అస్త్
గిరఫ్తారే రన్జో అజాబ్ వ అనా అస్త్

6. బిరస్త్ ఆఁకే బర్ మౌత్ దారద్ నిగహ్
బురేదహ్ జిదున్యా దో దీదహ్ బరహ్

7. సఫర్ కర్దా పేష్ అజ్ సఫర్ సూయే యార్
కషీదహ్ జిత దున్యా హిమహ్ రక్తో బార్

8. పయే దార్ వుఖ్బా కమర్ బస్తహ్ చుస్త్
రిహా కర్దహ్ సామానే ఈఁ కానహ్ సుస్త్

9. చు కారే హయాత్ అస్త్ కారే నిహాఁ
హమా బిహ్ కె దిల్ బుగ్సలి జీఁ మకాఁ

10. జహన్నమ్ కజు దాద్ ఫర్ఖాఁ కబర్
హమీఁ హిరస్ దున్యా అస్త్ జానే పిదర్

11. చూ ఆఖిర్ జి దున్‌యా సఫర్ కరదన్ అస్త్
చూ రోజే అజీం రహ్ గుజర్ కర్‌దన్ అస్త్

12. చిరా ఆఖిలే దిల్ బహ్ బంరద్ దరాహ్
కె నాగహ్ వ జద్ బర్‌గులే ఔ కిజాం

13. బదీం కహ్‌బా బస్తన్ దిలే కుద్ ఖతా అస్త్
కె యీాం దుష్మనే దీన్ వ సిద్‌కో సఫా అస్త్

14. చి హాసిల్ అజీం దిలిస్తానే దో రంగ్
కె గాహే బసుల్హత్ కుష్‌దు గా బజంగ్

15. చిరా దిల్ నా బన్‌ది బదాం దిల్‌సితాం
కె మిహర్ష్ రిహాన్ద్ జి బన్‌దే గిరాం

16. బిరో ఫక్‌రే అన్‌జామ్ కున్ యే గవీం
జ సఅదీ షినోగర్ జిమన్ నష్‌నవీం

17. వురూసి బవద్ నౌబతే మాతమత్
అగర్ బర్ నికోయీా బవద్ ఖాతమత్

# ఫార్సి పద్యము తెలుగు అనువాదము

1. జాగ్రత్త! ఓ వివేకముగల, మంచి స్వభావం గలవాడా, ప్రపంచ దురాశ వెనుక నీవు నీ ధర్మాన్ని నాశనం చేసుకోకు.
2. ఈ మర్త్య ప్రపంచాన్ని ప్రేమించకుము, దీని సుఖంలో వందలాది దుఃఖములు దాగి ఉన్నాయి.
3. మీకు వినగల శక్తి వుంటే, మీ సమాధి నుండి ఈ గొంతు వినుపించును.
4. ఓ నా ప్రియమైన మానవుడా! కొన్ని రోజులకు పరిమితమైన ఈ అణగారిన ప్రపంచ దుఃఖములో నీవు మండిపోకుము.
5. ఈ అవమానకరమైన ప్రపంచాన్ని అనుసరించిన ప్రతి వ్యక్తి దుఃఖము. వేదన మరియు బాధలో ఉన్నాడు.
6. మరణాన్ని చూసేవాడే స్వాతంత్రుడు, ప్రపంచాన్ని కాదని అతని రెండు కళ్ళు వేచి చూస్తున్నాయి.
7. అతడు మరణించక ముందే తన ప్రియుని వైపు ప్రయాణించాడు, మరియు అతడు తన వస్తువులన్నింటిని ప్రపంచం నుండి వేరు కున్నాడు.
8. పరలోకం కోసం సిద్ధమైనాడు, మరియు ఈ పనికిరాని గృహ వస్తువులను వదిలివేశాడు.
9. జీవితంపై నమ్మకం లేదు, కాబట్టి మీరు ఈ ఇంటిని వదిలించుకోవడం మాత్రమే సరైనది.
10. ఓ ప్రియతమా! ఖుర్ఆన్ ప్రకటించిన నరకం ఈ ప్రపంచ దురాశే.

11. చివరకు మనం ఈ ప్రపంచంను వదిలి వెళ్ళాలి, ఒక రోజు మనం ఈ మార్గం గుండా వెళ్ళాలి.

12. మరి జ్ఞానులు దీనిని ఎందుకు ప్రేమిస్తారు? అకస్మాత్తుగా దాని పువ్వులపై శరదృతువు గాలి వీచును.

13. ఈ పనికిమాలిన ప్రపంచాన్ని ప్రేమించడం పొరపాటు. ఎందుకంటే ఇది ధర్మం, మరియు నిజాయితీకి శత్రువు.

14. ఈ రెండు రంగుల ప్రేమికుడితో మీకు ఏమి లాభించును, అతడు ఒకసారి సయోధ్య ద్వారా మరొకసారి పోరాటం ద్వారా మిమ్మల్ని చంపుతాడు.

15. నీవు ఆ ప్రియమైనవాడిని ఎందుకు ప్రేమించవు? అతని ప్రేమ తీవ్రమైన కారాగార శిక్ష నుండి విముక్తి కల్పిస్తుంది.

16. ఓ మార్గభ్రష్టుడా! వెళ్ళుము, నీ అంతము గురించి ఆలోచించుము. మీరు నా మాట వినకపోతే, స'ది మాట వినండి.

17. మీ సంతాప సమయం ఆనందంగా మారును, మీ అంతము శుభప్రదమైనచో మీ మరణ సమయం సంతోషకరమైనదిగా మారును.

# అల్ వసియ్యత్ పుస్తక అనుబంధము

వీలునామా (అల్ వసియ్యత్) గురించి ప్రచురించదగ్గ కొన్ని ముఖ్యాంశములు ఈ క్రింద ప్రస్తావించబడుచున్నవి.

(1) ఖబ్రిస్తాన్ కార్యనిర్వాహక సమితి ఖబ్రిస్తాన్ అనివార్య కార్యములన్ని సంపూర్ణముగా పూర్తి చేయబడినవని ప్రచురించే వరకు వీలునామ నిబంధనలను పూర్తి చేసిన వ్యక్తి పార్థివదేహాన్ని ఖబరస్తాన్ లో సమాధి చేయుటకు తీసుకరావడానికి అనుమతి లేదు. వంతెన మొ॥ అవశ్యక కార్యములు ముందుగా పూర్తి చేయవలెను. అప్పటి వరకు పార్థివదేహం సురక్షితమైన ఒక పెట్టెలో వుంచి తాత్కాలికంగా వేరే ఖబరస్తాన్ లో సమాధి చేయాలి.

(2) వీలునామ నిబంధనలను పాటించుటకు అంగీకరించిన ప్రతి వ్యక్తి పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు కనీసము ఇద్దరు సాక్షుల సాక్ష్యముతో సమితికి అప్పగించుట అనివార్యము. అహ్మదియ్యా సంఘ ఆశయాల ప్రచార నిమిత్తము తన స్థిర, చరాస్తుల పదవ భాగము వీలునామా లేదా అంకిత రూపములో ఇచ్చెదనని స్పష్టముగా వ్రాయవలెను. దీనిని కనీసము రెండు పత్రికలలో ప్రచురించుట అనివార్యము.

(3) సమితి చట్టపరముగా, ధర్మ శాసన ప్రకారముగా వీలునామా గూర్చి పూర్తి సంతృప్తి చెందిన తరువాత తమ సంతకముతో ఒక సర్టిఫికేట్ వీలునామ వ్రాసిన వ్యక్తికి ఇవ్వాలి. పైన పేర్కొన్న నియమాల ప్రకారము ఎవరిదైన పార్థివదేహాన్ని ఈ ఖబ్రిస్తాన్‌కు తీసుక వచ్చినచో ఆ పట్టా (సర్టిఫికేట్)ను సమితికి చూపించుట అనివార్యము. సమితి ఆదేశానుసారము అతని కోసం కేటాయించిన ప్రదేశములోనే సమాధి చేయవలెను.

(4) ప్రత్యేక పరిస్థితుల్లో సమితి నిర్ణయించినవారు తప్ప బాలురను ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి చేయడము జరుగదు. ఎందుకనగా వారు స్వర్గస్తులు. ఆ పార్థివదేహము ఇతర బంధువు కూడ వీలునామా నిబంధనలను పూర్తిగా పాటించే వరకు ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి చేయడం జరగదు.

(5) ఖాదియానేతర ప్రాంతములో మరణించిన వ్యక్తి పార్థివ దేహాన్ని పెట్టె లేకుండా ఖాదియాన్‌కు తీసుక రావడానికి అనుమతి లేదు. కనీసము ఒక మాసము ముందు తెలియజేయుట అనివార్యము, తద్వారా సమితి ఖబ్రిస్తాన్ విషయంలో ఎదురయ్యే ఆకస్మిక ఆటంకములను దూరం చేసి అనుమతించును.

(6) వీలునామా నిబంధనలను పూర్తి చేసినవారు ఎవరైన ప్లేగు వ్యాధితో మరణిస్తే వారి పార్థివదేహాన్ని రెండు సంవత్సరముల వరకు శవపేటికలో భద్రపరచి ఇతర స్థలములో తాత్కాలికముగా సమాధి చేయవలెను. రెండు సంవత్సరాల తరువాత అతడు మరణించిన ప్రదేశములో కాని ఖాదియాన్‌లో కాని ప్లేగు వ్యాధి లేని సమయంలో ఖాదియాన్ తీసుకరావలెను.

(7) స్థిర, చరాస్తుల పదవ భాగమును సమర్పించుటయేగాక, సాధ్యమైనంత వరకు ఇస్లాం ఆదేశములను పాటించడము, ధార్మికమైన, పరిశుద్ధమైన కార్యములలో కృషి చేయుట అనివార్యము. విశ్వాసుడు అల్లాహ్ ఒక్కడేనని గుర్తెరిగినవాడై, అతని సందేశహరునిపై స్వచ్ఛమైన విశ్వాసమున్న వాడై వుండవలెను. ప్రజల హక్కులను హరించేవాడై వుండరాదు.

(8) తమ ఆస్తిలో పదవ భాగమునకై వీలునామా వ్రాసినవారు, తరువాత అకస్మాత్తుగా నదిలో పడి లేదా ఇతర దేశములో మృతి చెందినచో, అక్కడి నుండి పార్థివదేహాన్ని తీసుకరావడము

కష్టసాధ్యమైనచో వారి వీలునామా రద్దుకాదు. దైవ దృష్టిలో ఆ వ్యక్తి ఈ ఖబ్రిస్తాన్‌లోనే సమాధి అయినట్లుగా నుండును. వారి స్మారకంగా ఈ ఖబ్రిస్తాన్‌లో ఒక శిలాఫలకముపై వారి సంఘటనలు లిఖించి పెట్టవలెను.

(9) సమితి (అంజుమన్) అధీనములో నున్న ధనమును అహ్మదియ్య సంఘము ఆశయాల కోసం తప్ప ఇతర చోట వెచ్చించడానికి అధికారము లేదు. ఆ ఆశాయాలన్నింటిలో ఇస్లాం వ్యాప్తి ముఖ్యమైనది. సమితి ఏకాభిప్రాయముతో ఆ ధనాన్ని వ్యాపారము ద్వారా కూడా అభివృద్ధి పర్చవచ్చును.

(10) సమితి (అంజుమన్) సభ్యులందరు అహ్మదియ్య సంఘము లో చేరివుండవలెను. పవిత్ర స్వభావము, నీతి నిజాయితి గలవారై వుండవలెను. భవిష్యత్తులో ఎవడైన పవిత్ర స్వాభావికుడు కాదని, అతడిలో నిజాయితి లేదని, అతడు ఒక ద్రోహి, ప్రాపంచిక భావాలు కల్గివున్నాడని నిరూపణ అయినచో సమితి నిస్సంకోచంగా తమ సమూహము నుండి అతన్ని తొలగించి అతని స్థానములో మరో వ్యక్తిని నియమించవలెను.

(11) వీలునామా ధనమును గూర్చి ఏదైన సమస్య తలెత్తినచో, దీనికి అయ్యే ఖర్చు మొత్తము వీలునామా ధనము నుండి చెల్లించవలెను.

(12) ఎవరైనా వీలునామా వ్రాసిన తరువాత తన బలహీన విశ్వాసము వలన తన వీలునామాను తిరస్కరించినగాని, ఈ సంఘము నుండి వెనుదిరిగినగాని కమీటి చట్టపరంగా అతడి ఆస్తిని స్వాధీనపర్చు కున్నప్పటికీ ఆ ఆస్తిని తన ఆధీనములో నుంచుకొనుట తగదు. ఆ ఆస్తిని అతనికి తిరిగి ఇవ్వవలెను. ఎందుకనగా అల్లాహ్‌కు ఎవరి ధనము అవసరము లేదు. దైవ

దృష్టిలో అలాంటి ఆస్తి అసహ్యించబడినది, తిరస్కరించబడినది.

(13) సమితి (అంజుమన్) అనేది అల్లాహ్ నియమించిన ఉత్తరాధికారికి ప్రతినిధి. కావున ఈ సమితి ప్రాపంచిక కోరికల నుండి పూర్తిగా దూరంగా వుండాలి. దీని వ్యవహారములన్నియు యదార్ధముగా, న్యాయపరమైనవిగా వుండవలెను.

(14) ఈ సమితి సహాయ, సహకారముగా ఇతర సుదూర దేశాల్లో కూడా దీని ఆదేశాలకు లోబడి వుండే ఇటువంటి సమితులను ఏర్పాటు చెయ్యాలి. అక్కడి నుండి పార్థివదేహాన్ని తీసుకురావడము కష్టతరమైనచో అచ్చటనే సమాధి చేయడము ఉత్తమము. అటువంటి వ్యక్తి పుణ్యప్రాప్తి కొరకు తన మరణమునకు ముందు తన ఆస్తి పదవ భాగమును వీలునామాలో వ్రాయాలి. ఆ వీలునామా ఆస్తిని స్వాధీన పర్చుకోవడము ఆ దేశ సమితి బాధ్యత యగును. ఆ ఆస్తిని ఆ దేశ ధార్మిక ఆశయాలకే వినియోగించడము ఉత్తమము. ఏదైన అవసరమును గమనిస్తూ ఆ ధనమును ప్రధాన కార్యాలయము అనగా ఖాదియాన్ సమితికి చెల్లించవచ్చును.

(15) ఈ సమితి కేంద్రము ఎల్లప్పుడు ఖాదియాన్‌లోనే వుండుట అనివార్యము. ఎందుకనగా అల్లాహ్ ఈ ప్రదేశానికి శుభములు నొసంగి వున్నాడు. భవిష్యత్తులో అవసరాలననుసరించి ఈ సమితి సరిపోయేంత భవనమును నిర్మించాలి.

(16) ఈ సమితి ఖుర్ఆన్, హదీసు జ్ఞాన నిపుణులు, అరబ్బీలో మంచి అర్హత గల అహ్మదియ్య సంఘపు గ్రంథములను జ్ఞప్తియందుంచుకొను కనీసము ఇద్దరు సభ్యులు శాశ్వతముగా వుండవలెను.

(17) వీలునామా పుస్తకము ప్రకారము వీలునామ వ్రాసిన వ్యక్తి కుష్ఠి రోగి అయినచో, అతడు శారీరకంగా ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి

కావడానికి అనర్హుడైనచో ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి చేయడము ఉత్తమము కాదు. కాని అతడు తన వీలునామాపై స్థిరంగా వున్నచో అతనికి కూడ ఇందులో సమాధి అయ్యే వారి స్థాయి లభించును.

(18) స్థిర, చరాస్తులు లేనివాడు మహాజ్ఞాని, ధర్మాత్ముడు, సంపూర్ణ విశ్వాసము గలవాడని, అతడిలో ఎటువంటి కపటము, ప్రపంచ వ్యామోహం లేని వాడని, వినయ విధేయతలో ఏ లోపము లేని వాడని నిరూపణ అయినచో అతన్ని కూడా నా అనుమతితో గాని నా తదుపరి సమితి ఏకాభిప్రాయంతో గాని ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి చేయవచ్చును.

(19) అల్లాహ్ ప్రత్యేక దైవవాణి ద్వారా తిరస్కరించబడువాడు వీలునామా ధనము చెల్లించినా ఈ ఖబ్రిస్తాన్‌లో సమాధి చేసేందుకు అర్హుడు కాడు.

(20) సంఘ స్త్రీ, పురుషులందరు పై నిబంధనలను పాటించుట అనివార్యము. ఈ విషయములో అల్లాహ్ నన్ను నా కుటుంబీకులను మనహాయించి యున్నాడు. ఈ మినహాయింపును వ్యతిరేకించు వాడు కపటము గలవాడు.

పైన పేర్కొనబడినవి అనివార్య నిబంధనలు. ఈ నిబంధనలను పూర్తిగా పాటించువాడే ఇక ముందు ఈ స్వర్గ శ్మశానములో సమాధి చేయబడును. కొందరు దురాలోచన గలవారు ఈ వ్యవహారంలో మమ్ముల్ని విమర్శించవచ్చు. ఈ పద్ధతిని స్వప్రయోజనాల కొరకని లేదా దీనిని దురాచారమని భావించ వచ్చును. కాని ఇది దైవ కార్యమని గుర్తుంచుకోవాలి. అతడు కోరినది చేయును. నిస్సందేహంగా అతడు ఈ వ్యవస్థ ఏర్పాటు ద్వారా కపటులు, విశ్వాసుల మధ్య తేడాను చూపదల్చినాడు. ఈ పద్ధతిని గూర్చి సమాచారము పొందిన తక్షణమే తమ ఆస్తిలో

పదవ భాగమును లేదా అంతకు మించి కూడా దైవ మార్గములో అంకితము చేయాలనే ఉత్సాహము గల వారు తమ విశ్వాసమును ధృవీకరింతురనునది నేను స్వయముగా గమనిస్తున్నాను. అల్లాహ్ ఇట్లు నుడివెను,

الٓمّٓ ۔اَحَسِبَ النَّاسُ اَنۡ يُّتۡرَكُوۡۤا اَنۡ يَّقُوۡلُوۡۤا اٰمَنَّا وَهُمۡ لَا يُفۡتَنُوۡنَ

"మేము విశ్వసించితిమని అన్నందులకు వారు వదిలివేయ బడుదురని, పరీక్షించబడరని లోకులు అనుమానించిరా?" (అన్‌కబూత్-29:2,3) ఇది పరీక్షే కాదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు ప్రాణాలర్పనతో పరీక్షించబడ్డా వారు సంతోషముగా తమ తలలను అల్లాహ్ మార్గములో అర్పించారు. మరి ప్రతి ఒక్కరిని ఈ ఖబ్రిస్తాన్ లో సమాధి చేయుటకు ఎందుకు అనుమతించరాదనే భావన ఎంత వరకు సబబు. ఇది నిజమైతే అల్లాహ్ ప్రతి కాలములో పరీక్ష ఎందుకు తీసుకుంటాడు. అతడు ప్రతి కాలంలో పవిత్రత, అపవిత్రత మధ్య వ్యత్యాసమును బహిర్గత పరచాలని ఆశిస్తాడు. అందుచే అతడు ఇప్పుడు కూడా అదే విధముగా చేశాడు. అల్లాహ్ తఆలా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో కొన్ని సున్నితమైన పరీక్షలు నిర్వహించెడివాడు. ఉదా॥ ఏ వ్యక్తి అయినా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో సలహా గోరదలచినచో ముందుగా కానుక అర్పించనిదే వారితో (స.అ) సలహా తీసుకోరాదను ఆచారము ఉండేది. ఇందులో కూడా దాంభికులకు పరీక్ష వుండేది. ప్రస్తుతము ఈ పరీక్షలో కూడా ప్రపంచము కంటే ధర్మమునకే ప్రాధాన్యత నిచ్చు గొప్ప నీతిమంతులు ఇతరుల కంటే శ్రేష్టులగుట మనము స్వయముగా గమనిస్తాము. వారు బైత్ (ప్రతిజ్ఞ) పూర్తి చేశారని, తమ నిజాయితిని ప్రదర్శించారని ఋజువు అవుతుంది.

నిస్సందేహముగా ఈ రకమైన ఏర్పాటు దాంభికులకు చాలా బాధ కల్గించును. దీనితో వారి లోపాలు బహిర్గతమగును. వారు స్త్రీలైన, పురుషులైన మరణానంతరము ఈ ఖబ్రిస్తాన్ లో సమాధి కాజాలరు.
فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ ۙ فَزَادَهُمُ اللّٰهُ مَرَضًا (అల్ బఖరహ్–2:11) (అనగా వారి మనస్సులను ఒక రోగము పీడించుచుండెను. అల్లాహ్ ఆ రోగమును మరింత అధికము చేసెను.) కాని ఈ కార్యములో పోటిపడు వారు నీతిమంతులలో పరిగణించబడుదురు. కలకాలం వారిపై దైవ అనుగ్రహం ఉంటుంది.

మొత్తానికి ప్రమాదముల దినములు దగ్గరలో గలవని గుర్తుంచుకోండి. భూమిని తలక్రిందులుగా చేయు ఒక భీకరమైన భూకంపము సమీపంలో గలదు. కావున వారు శిక్షను చూడక ముందు తాము ప్రపంచమును త్యజించిన వారుగా నిరూపించు కుంటే నా ఆదేశాలను వారు నెరవేర్చినచో దైవ దృష్టిలో వారే నిజమైన విశ్వాసులగుదురు, వారే ప్రథమ అగ్రగాములుగా లిఖించబడుదురు. నేను యధార్థముగా చెబుతున్నదేమనగా ప్రపంచమును ప్రేమిస్తు ఈ ఆదేశాలను విస్మరించు దాంభికుడు, నేను స్థిర, చరాస్తులన్నింటిని దైవ మార్గములో సమర్పించి ఈ శిక్ష నుండి రక్షించుకుంటే ఎంత బాగుండునని శిక్షా సమయంలో విచారము వ్యక్తపరిచే కాలము చాలా దగ్గరలోనే వున్నది. ఈ శిక్షను తిలకించిన తరువాత విశ్వాసము లాభించదని గుర్తించుడు. దాన ధర్మాలు నిరర్థకము. చూడండి! నేను మీకు అతి సమీప శిక్ష సమాచారమిస్తున్నాను. మీకు ఉపయోగపడు బత్తెము తొందరగా ప్రోగు చేసుకొనుము. నాకు మీ ఆస్తిని ఆక్రమించుకోవాలనే కోరిక లేదు. మీరు ఇస్లాం ప్రచార నిమిత్తము తమ ఆస్తిని ఒక సమితికి అప్పగించుడు, స్వర్గమును పొందుడు. ప్రపంచాన్ని ప్రేమిస్తు నా

ఆజ్ఞను తిరస్కరించువారు ఎందరో గలరు కాని వారందరు అతి త్వరగా ప్రపంచము నుండి వేరు చేయబడుదురు. అప్పుడు అంతిమ సమయంలో ఇట్లందురు. هٰذَا مَا وَعَدَ الرَّحْمٰنُ وَصَدَقَ الْمُرْسَلُوْنَ (యాసీన్-36:53) అనగా ఈ విషయము దయామయుడైన అల్లాహ్ మాతో చేసిన వాగ్దానమే. ప్రవక్తలు చెప్పినదంతయు సత్యమే గదా!)

**రచయిత**

మీ విధేయుడు

**మిర్జా గులాం అహ్మద్**

దేవుని వైపు నుండి మసీహ్ మౌవూద్

6 జనవరి 1906 క్రీ. శ.

**(పత్రిక అల్ హకమ్, సంపుటి 10, సంఖ్య 2, తేది 17 జనవరి 1906)**

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡم

**సద్‌ర్ అంజుమన్ అహ్మదియ్య కార్యదర్శుల సమితి ప్రథమ సభా నివేదిక**

సమావేశపు తేదీ : 29 జనవరి 1906

**సభా సభికులు**

హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ గారు సభాధ్యక్షులు

ఖాన్ సాహిబ్ ముహమ్మద్ అలి ఖాన్ సాహిబ్

సాహిబ్‌జాదా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ గారు

మౌల్వీ సయ్యద్ ముహమ్మద్ అహ్సన్ గారు

ఖ్వాజా కమాలుద్దీన్ గారు

డా॥ సయ్యద్ ముహమ్మద్ హుస్సైన్ గారు సమితి కార్యదర్శి.

కొన్ని ముఖ్య సూచనలు, అనుమతులు ఇవ్వడము అత్యవసరమై వుండెను. ఇతర ప్రాంతాల సభ్యులకు తెలియజేయు సమయము లేనందున హజ్రత్ ఇమాం అలైహిస్సలాం అనుమతితో నిబంధనలు ఆమోదించిన తర్వాత ఈ సభా నిర్వహించ బడుతున్నది.

ఈ క్రింది విషయములు తీర్మానించబడినవి.

1. ప్రతిపాదించిన వీలునామా ప్రతిని ........... ఆమోదించవలెను.

2. ప్రస్తుతము ఎనిమిది వందల ప్రతులను ప్రచురించాలని, "అల్ హకమ్", "బదర్" లో కూడా ప్రచురింపజేయవలెనని నిర్ణయించబడెను.

3. వీలునామా పూర్తి చేసిన వారికి దిగువ సూచనలు అమలు పరచుటకు పంపవలెనని, ఈ సూచనలు వీలునామా పత్రము

క్రింది భాగములో ప్రచురించవలెనని నిర్ణయించబడెను.

(అ) అవసరమైనచో వీలునామా చేయువారు వీలునామా ప్రతిని ...... కోరవలెను. తెల్ల కాగితముపై దానిని మరల వ్రాయవలెను. వదిలిన ఖాళీ స్థలమును సందర్భానుసారము స్వయముగా పూరించవలెను. వీలునామా వ్రాయుటకు దృఢమైన కాగితము ఉపయోగించవలెను.

(ఆ) సాధ్యమైనంత వరకు వీలునామాను రిజిస్ట్రీ చేయించాలి. వీలునామాపై వీలునామా చేయువాని వారసుల లేదా అతని బంధువుల సంతకము సాక్ష్యాలుగా వుండవలెను. దీనితో పాటు పట్టణము లేదా గ్రామమునకు సంబంధించిన ఇద్దరు పెద్దలు సాక్ష్యులుగా వుండవలెను.

(క) వీలునామా చేయువాడు మరియు సాక్ష్యులు అక్షరాస్యులైన, నిరక్షరాస్యులైనా తమ సంతకము ముద్రీకగాక బొటనవేలు ముద్ర ఖచ్చితముగా వేయవలెను. అక్షరాస్యులు సంతకము కూడా చేయవలెను. పురుషుడు ఎడమ చేతి, స్త్రీ కుడి చేతి బొటన బొటనవేలు ముద్ర వుండవలెను.

(ఖ) వీలునామా కర్త వ్రాయగల్గితే తన వీలునామా తానే స్వయముగా వ్రాయవలెను.

(గ) వీలునామా పత్రముపై స్టాంప్ అవసరము లేదు.

(ఘ) వీలునామా కర్తకు కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులలో చట్టపరమైన సలహా అవసరమున్నచో ...... సమితి న్యాయ సలహాదారున్ని ఉత్తరాల ద్వారా సంప్రదించవలెను.

(4) పంజాబ్ భూస్వాములకు వీలునామా వ్రాయుటలో ఏమైన ఆటంకములు ఎదురైనచో వారు ఎంత పరిమాణములో ఆ ఆస్తిని వీలునామాలో వ్రాయాలనుకుంటారో దానిని తమ జీవితములో

వీలునామా రూపములో కాకుండా బహుమానముగా ఇవ్వవలెను. ఆ అంగీకార పత్రముపై వారసులు వుండినచో సమ్మతము కోసం వారి సంతకము చేయించాలి. బహుమాన పత్రమును రిజిస్ట్రీ చేయించుట అనివార్యము. అలాగే బహూకరించిన ఆస్తిని సదర్ అంజుమన్ అహ్మదియ్యాహ్ కార్యదర్శుల సమితి పేరు మీద నమోదు చేయించాలి. క్రొత్తగా సంపాదించు ఆస్తులను కూడా ఎప్పటికప్పుడు ఇలాగే చేయాలి.

5. తీర్మానము నెంబరు 4 ప్రకారము బహూకరించుటలో ఆటంకము కల్గినచో వారు వీలునామా లేదా బహూకరించదలచిన ఆస్తి మార్కెట్ విలువ నిర్ణయించి లేదా దానిని విక్రయించగా వచ్చు డబ్బును ఖబ్రిస్తాన్ కార్యనిర్వాహక సమితికి అప్పగించాలి. ఇకముందు అతడు అదనపు ఆస్తులను సంపాదించినచో వాటి గురించి కూడా ఎప్పటికప్పుడు ఇదే విధముగా అమలు చేయాలి.

6. ఆస్తి సంపదలు ఏమి లేనివారు, ఆదాయమునకు ఏదో ఒక మార్గము గలవారు తమ నెలసరి ఆదాయములోని పదవ (1/10) భాగమును సమితికి అప్పగించాలి. అహ్మదియ్యాహ్ సంఘమునకు వారు ప్రస్తుతము చెల్లించు చందాలను ఈ 1/10 పదవ భాగములో కలిపి ఇవ్వడం లేదా వేరు పరచడం అనేది వారి ఇష్టానుసారము జరుగును. వారు ప్రస్తుత చందాలను ఈ (1/10) పదవ భాగములో చేర్చాలని అనుకుంటే వారు పంపించే చందాలను అదేవిధముగా పంపించవలెను. అదియునుగాక ఆ చందాలను మినహాయించి మిగిలిన ధనమును ఖబ్రిస్తాన్ కార్యనిర్వాహక సమితి ఆర్థిక కార్యదర్శికి పంపించాలి. తరువాత ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ సమితి కార్యదర్శితో చేయాలి. కాని వారి మరణానంతరము వారు వదిలిన పూర్తి ఆస్తిలో కనీసము 1/10

వ భాగమునకు యాజమాన్య హక్కులు సమితికి చెందునని వీలునామా వ్రాయాలి.

**గమనిక :-**

(1) వీలునామా, బహుమాన చట్టపరమైన విషయముల గూర్చి ఖబ్రిస్తాన్ కార్యనిర్వాహక సమితితో చట్టపరమైన విషయాల గూర్చి తెలుసుకోదల్చినవారు వీలునామా లేదా బహూకరణ ప్రతిని గాని వ్రాసే ముందు ఉత్తర ప్రత్యుత్తరాలతో పొందవచ్చును.

(2) ప్రత్యేక పరిస్థితులలో కార్యదర్శుల సమితితో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా నిర్ణయించవచ్చును.

7. ఖబ్రిస్తాన్ కు సంబంధించిన చందాల మొత్తమును లేదా అల్ వసియ్యత్ పుస్తకము ప్రకారము పైన వివరించిన రూపాలలో వచ్చు మొత్తమును కేవలము **"ఖబరస్తాన్ కార్యనిర్వాహక సమితి ఆర్థిక కార్యదర్శి"** చిరునామాకు పంపించాలి. మరొకరికి గాని మరో చిరునామాకు గాని పంపరాదు.

మీ విధేయుడు
ముహమ్మద్ అలి కార్యదర్శి
29 జనవరి 1906.
నూరుద్దీన్
1 జూలై 1906.

(సంతకము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం)
మీర్జా గులాం అహ్మద్

# సయ్యిద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు తఆలా అన్‌హు ఆదేశములు.

(1) మూడవ అంశము వీలునామా సమస్య. దీనిని అల్లాహ్ మన కొరకు ప్రాధాన్యత గల వస్తువుగా నొసంగినాడు. దీని ద్వారా స్వర్గమును మనకు దగ్గరగా చేసెను. హృదయములో విశ్వాసము, స్వచ్ఛత వున్నవారు కూడా వీలునామా వ్రాయుటలో బద్ధకమును ప్రదర్శింతురు. అట్టివారు వీలునామా వ్రాయుటలో తొందర పడాలని నేను ఉపదేశిస్తున్నాను. ఈ సోమరితనం వలనే కొందరు పుణ్యాత్ములు రోజులు గడుపుతారు. ఈ రోజు రేపు అని అంటూనే వారికి మరణము సంభవించును. మనస్సు బాధపడును. వీరు కూడ ఆ మహాత్ముల సరసన సమాధి అయితే బాగుండునను కోరిక జనించును, కాని కాజాలరు. వీరు చాలా పుణ్యాత్ములు మరియు ఇతర పుణ్యాత్ముల వెంబడి సమాధి యగుటకు అర్హులు, కాని కొద్దిపాటి అశ్రద్ధ, సోమరితనము ఇందులో ఆటంకమైనదని వీరి మరణముపై అందరి మనస్సులు గమనించును. మన సంఘములో ఎంతో మంది పదవ భాగము కన్న ఎక్కువ చందా చెల్లించువారున్నారు, కాని వారు వీలునామా వ్రాయరు. అట్టి మిత్రులు కూడా వసియ్యత్ చేయవలెను. ఇలాంటి మిత్రులకు ఏమి ఇబ్బంది వుండదు. మరికొందరు రూపాయికి అయిదు పైసలు, ఆరు పైసలు చందా చెల్లించువారున్నారు. వారిని వీలునామా నుండి కేవలము అర్థ పైసా, పావు పైసా దూరం చేయుచున్నది. అనగా మన సంఘములోని వేల మంది కేవలము కొన్ని పైసల తేడా వలన వీలునామా నుండి దూరమై వున్నారు. స్వర్గానికి చేరువలో వుండి కూడా దానిలో ప్రవేశించలేకపోతున్నారు.

కొంతమంది మరణ సమయంలో వీలునామా వ్రాస్తారు. వాస్తవానికి ఈ వీలునామా స్వీకరించబడదు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దానిని ఇష్టపడలేదు. ఆరోగ్యకర జీవితములో, పూర్తి స్పృహతో చేయునదే నిజమైన వీలునామా అనబడుతుంది. కావున వీలునామాకు సమానముగా చందా చెల్లించు మిత్రులు ఎందరో వున్నారు. వారు లెక్క చూసుకొని వీలునామా వ్రాయగలరు. కొందరు పరిశీలించినచో కేవలము ఒక పైసా చందా ఎక్కువ ఇవ్వడం వలన వారికి స్వర్గ వాగ్దానము లభించునని ఆలోచించవలెను. కావున మిత్రులు సాధ్యమైనంత వరకు వీలునామా వ్రాయవలెను. వీలునామా వ్రాయడము వలన విశ్వాసము తప్పక అభివృద్ధి చెందునని నా నమ్మకము. ఈ ప్రదేశములో ధర్మనిష్ఠాపరులు సమాధి చేయబడుదురని అల్లాహ్ వాగ్దానమున్నప్పుడు వీలునామా వ్రాసిన వానిని నిష్ఠాపరునిగా కూడా చేసి వేయును.

(అల్ ఫజల్ 1 సెప్టెంబర్, క్రీ.శ. 1932)

## వసియ్యత్ చేయుటలో త్వరపడండి

2. నేను ప్రస్తావించినట్లు ఇస్లాం స్థాపించిన మొత్తము ప్రణాళిక ను వసియ్యత్ ఆవరించి వున్నది. వసియ్యత్ ఆదాయము ఇస్లాం ప్రచారము కొరకు అనేది మాటలు మాత్రమేనని కొందరు తప్పుగా ఆలోచిస్తారు. కాని ఇది సరియైనది కాదు. వసియ్యత్ మౌఖిక బోధ, ఆచరణాత్మక ప్రచారము రెండింటికి వర్తిస్తుంది. ఇందులో ప్రచారమే గాకా ప్రతి వ్యక్తికి గౌరవ ప్రదమైన ఆహారము నొసంగబడు నూతన ప్రణాళిక సంపూర్ణము చేయడము కూడా ఒక భాగమే. వసియ్యత్ ప్రణాళిక సంపూర్ణమైనప్పుడు దీని ద్వార కేవలము ప్రచారమే కాదు, ఇస్లాం ఆశయము ప్రకారము ప్రతి

వ్యక్తి అవసరము దీని ద్వారా పూర్తి చేయబడును. ఇన్షా అల్లాహ్ దుఃఖము, బాధ, కరువు ప్రపంచము నుండి రూపుమాపబడును. అనాథ భిక్షాటన చేయదు, వితంతువు ప్రజల ముందు చేతులు చాపదు, నిరాశ్రయుడు ఇబ్బందులకు గురికాడు, ఎందుకనగా వసియ్యత్ శిశువులకు తల్లి, యువకులకు తండ్రి, స్త్రీలకు సౌభాగ్యముగా మారుతుంది. బలవంతముగాక ప్రేమానురాగముతో సోదరుడు సోదరునికి దీని ద్వారా సహాయము చేయును. ఇట్లు చేయుట నిష్ప్రయోజనము కాదు. సహాయము చేయు ప్రతివాడు అల్లాహ్‌తో ఉత్తమ ప్రతిఫలము పొందును. ధనికుడు గాని బీదవాడు గాని నష్టపడడు. ఒక జాతి మరొక జాతితో పోట్లాడదు. అతని మేలు ప్రపంచమంత వ్యాపించును.

కావున ఓ మిత్రులారా! ప్రపంచపు నూతన ప్రణాళికను మిస్టర్ చర్‌చల్ ఏర్పాటు చేయలేదు. మిస్టర్ రోజ్‌వెల్ట్ ఏర్పాటు చేయలేదు. ఈ అట్లాంటిక్ చార్టర్ వ్యాజ్యములన్నియు మోసము మాత్రమే. దీనిలో ఎన్నో లోపములు, దోషములు, తప్పులు గలవు. అల్లాహ్ వైపు నుండి అవతరించేవారే నూతన ప్రణాళికను స్థాపించ గలరు. వారి హృదయాలలో ధనవంతుడితో ద్వేషముండదు. బీద వాడితో అనవసర ప్రేమ యుండదు. వారు తూర్పునకు గాని పశ్చిమమునకు గాని సంబంధించిన వారు కారు. వారు దైవ సందేశహరులు. వారు శాంతిని స్థాపించే నిజమైన విద్యను బోధిస్తారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా వచ్చిన బోధయే నేడు శాంతిని స్థాపించును. దాని పునాది అల్ వసియ్యత్ ద్వారా క్రీ.శ 1905 లో వేయబడినది.

కావున మిత్రులందరు దీని ప్రాముఖ్యతను తెలుసుకొన వలెను. వివరించిన నిదర్శనములను బాగుగా జ్ఞప్తియందుంచు

కోవలెను. ఎందుకనగా బాల్షివిజమ్ సహానుభూతి పరులు ప్రతిచోట ఎదురవుతారు. నేను ఈ ప్రణాళిక గుణములు ప్రస్తావించి లోపాలు కూడా వివరించినాను. అదేవిధముగా ఇతర ప్రణాళికల గుణములు, లోపాలు ప్రస్తావించినాను. కావున వాటిని పరిశీలించండి. విద్యావేత్తలతో చర్చించినప్పుడు వాటిని దృష్టియందుంచుకోండి. ఇతర వ్యవస్థలననుసరించు వారి వద్ద ఈ నిదర్శనములకు ఏ సమాధానముండదని నేను మీకు అభయమిస్తున్నాను.

నేను ఈ రోజు ప్రస్తావించిన పద్దతి ద్వారానే ప్రపంచములో శాంతి స్థిరపడును. ఇరువది సంవత్సరాలకు పూర్వము క్రీ.శ. 1924 లో ప్రజలలో శాంతిని స్థాపించుటకు అల్లాహ్ నా ద్వారా **"అహ్మదియ్యత్"** అను గ్రంథములో వైభవోపేతమైన ఒక విషయాన్ని ఇట్లు తెలిపెను. గత పదమూడు వందల సంవత్సరాలలో ఏ వివరణకర్త కూడా ఇటువంటి వైభవోపేతమైన విషయాన్ని తెలుపలేదని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఆ బోధ నిశ్చయముగా చాలా గొప్పది. ఇలాంటి ప్రకటన చేయుట నా అలవాటు కాదు. కాని ఈ రకమైన ప్రకటన కేవలము ప్రవక్తలు,వారి ఉత్తరాధికారులు తప్ప ఈ రోజు వరకు ఎవ్వరు కూడా చేయలేదని నేను నిశ్చయము గా చెప్పగలను. చేసి యున్నచో నాకు దాని ఉదాహరణ చూపండి.

కనుక ఓ మిత్రులారా! వసియ్యత్ చేసిన వారు అనగా మీలో నుండి ఆయా ప్రదేశములలో వసియ్యత్ చేసినవాడు నూతన ప్రణాళికకు పునాది వేశాడని భావించాలి. ఈ నూతన సమితి అతనికి, అతని కుటుంబీకుల రక్షణకు పునాదిరాయి వంటిది. **"తహ్‌రీకే జదీద్"** లో పాల్గొనినవాడు, తన పేదరికము వలన చేరలేనివాడు ఈ వ్యవస్థ సఫలీకృతము కావడానికి నిరంతరము ప్రార్థనలు చేసినచో, వసియ్యత్ వ్యవస్థ వ్యాప్తికి పునాది వేసిన

వాడవుతాడు.

కనుక ఓ మిత్రులారా! ప్రపంచ నూతన ప్రణాళికలు ధర్మాన్ని రూపుమాపి ఏర్పాటు చేయబడుచున్నవి. మీరు **"తహ్రీకే జదీద్"** మరియు **"వసియ్యత్"** ద్వారా ధర్మమును స్థిరపరుచుచు ఇంతకంటే ఉత్తమమైన వ్యవస్థను త్వరగా ఏర్పాటు చెయ్యండి. పరుగులో ముందుకు దూసుకెళ్ళినవాడే విజయమును సాధిస్తాడు. కావున మీరు నూతన వ్యవస్థను తొందరగా స్థాపించుటకు అతి త్వరగా వసియ్యత్ చెయ్యండి. నలువైపుల ఇస్లాం, అహ్మదియ్యత్ పతాకము ఎగురవేయు శుభ దినములు వచ్చును. వసియ్యత్ చేసిన మిత్రులందరిని నేను అభినందిస్తున్నాను. ఇంతవరకు ఈ వ్యవస్థలో పాల్గొనని వారందరు కూడా ఇందులో పాల్గొని ధార్మిక, ప్రాపంచిక భాగ్యములతో సంపన్నులగుటకు అల్లాహ్ అనుగ్రహించాలని నేను దుఆ చేయుచున్నాను. ప్రపంచము ఈ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందవలెనని, పనికిమాలిన, మూర్ఖుల పట్టణమనబడు ఆ ఖాదియాన్ పట్టణము నుండి వెలువడిన ఆ కాంతి సర్వ ప్రపంచ అంధాకారాన్ని దూరము చేసినదని, ప్రపంచ అజ్ఞానమును రూపుమాపినదని, ప్రపంచ దుఃఖములన్నింటిని దూరము చేసినదని ప్రతి ధనవంతుడు, బీదవాడు చిన్నా పెద్దా పరస్పర ప్రేమానురాగాల తో కలిసి వుండే సౌభాగ్యమును కల్గించినదని ప్రపంచము అంగీకరించాలి.

(నిజామే నౌ, పేజి:110–112 రెండవ ఎడిషన్)

3. ప్రస్తుతము సంఘములోని ప్రతి ఒక్కరు వసియ్యత్ చేయవలెనని నా కోరిక. ప్రపంచములో ప్రతి వస్తువుకు ప్రదర్శన కాలముండును. ఖాదియాన్ మన అధీనము నుండి పోయినందు వలన, శత్రువులు **"బహిష్తమఖ్బరహ్"** వీరి అధీనములో లేదు.

దాని కొరకే వీరు వసియ్యత్ చేయుచుండేవారు. ఇప్పుడు వీరెట్లు వసియ్యత్ చేయుదురో మేము చూద్దామని” ఆసక్తితో వున్నారు. ఈ అపవాదమును దూరము చేయుటకు మన వద్ద ఒకే ఒక మార్గమున్నది. అది ప్రతి అహ్మదీ వసియ్యత్ చేయుటయే. మాకు అల్లాహ్ వాగ్దానములపై గల విశ్వాసము, నమ్మకము ఖాదియాన్ మా అధీనములో నుండుట, వుండక పోవుటతో సంబంధము లేదు. మేము అనుక్షణం మా విశ్వాసముపై స్థిరముగా వుండు వారమని ప్రపంచానికి తెలియజేయవలెను. ఈ కనీస విశ్వాస ప్రదర్శన ఇప్పుడు మీతో ఆశించబడుతుంది. కావున పదహారున్నర శాతం (1/16 అనగా వందకు 6 రూ॥ 25 పై॥) ఇవ్వలేని పరిస్థితిలో వున్న వ్యక్తి కూడా వసియ్యత్ చేసి ఇటు వంటి విశ్వాసమును ప్రదర్శించుట అవశ్యమని నేను భావిస్తున్నాను. మన సంఘములో వసియ్యత్ చేయనివారు ఒక్కరు కూడా వుండని విధముగా ప్రయత్నించవలెను.

(అల్ ఫజల్ 1948 జూన్ 5)

## వసియ్యత్ చందా చెల్లించుట

4. ఒక వ్యక్తి ఆదాయమునకు సంబంధించి వసియ్యత్ చేసి తన ఆదాయము ప్రకారము నెలసరి చందా చెల్లిస్తాడు, మిగిలిన డబ్బుతో ఒక ఆస్తిని సంపాదించినచో ఆ ఆస్తి నుండి కూడా వసియ్యత్ భాగము చెల్లించవలెనా? అని ఒకరు ప్రశ్నించారు.

ఇట్లు సమాధానమిచ్చారు: “అవును చెల్లించవలెను. వాస్తవానికి వసియ్యత్ మరణము తరువాత వున్నదానిలో నుండి చెల్లించబడాలి.”

**ప్రశ్న:–** ఈ విధముగనైతే వసియ్యత్ చందా రెండు సార్లు చెల్లించవలసి యుండును. ఒకసారి నెలసరి ఆదాయము నుండి,

రెండవ సారి వసియ్యత్ చందా చెల్లించబడిన ఆ ఆదాయముతో సంపాదించిన ఆస్తి నుండి.

ఇట్లు సమాధానమిచ్చారు: "మానవుడు తన ఆదాయము నుండి డబ్బు పొదుపు చేసుకొని ఆస్తి సంపాదించును. ఆస్తికి బదులుగా ఇతర కార్యములలో వినియోగించినచో వచ్చిన ఆదాయము నుండి వసియ్యత్ చందా చెల్లించును. అతడు ఆస్తి కొరకు డబ్బు ఖర్చు చేసినప్పుడు దానిలో నుండి చందా ఎందుకు ఇవ్వడు? ఇది సంపాదించిన ఆస్తి కాదా? ఒక వ్యక్తి వద్ద పది ఎకరాల భూమి వుందనుకొనుము వసియ్యత్‌లో ఒక ఎకరము ఇచ్చిన తరువాత మిగులు భూమి ఆదాయముతో కొంత డబ్బు ప్రోగు చేస్తాడు, ఇది అతని మరణము తరువాత తెలిసినచో దానిలో నుండి కూడా వసియ్యత్ చందా చెల్లించవలెను."

5. "వసియ్యత్ చందాను క్షమించు (మాఫీ) చేయు అధికారము నాకు కూడా లేదు. ఇది హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దైవ ఆదేశానుసారము స్థాపించిన చట్టము. నేను నా తరపు నుండి నియమించిన చందాలను తగ్గించగలను, తగ్గిస్తాను కూడా లేదా పెంచుతాను."

(15-03-1938)

6. వసియ్యత్ విషయములో నా అభిప్రాయములు చాలా కఠినమైనవి. దీనికి సంబంధించి మొదటి నుండి కొనసాగే వాటిని అమలు చేయవలెను. కాని నా దృష్టిలో మరణ సమయంలో చేయు వసియ్యత్ సరియైనది కాదు. ఎందుకనగా ఆ సమయంలో మానవుడు ఎలాంటి విశ్వాసాన్ని కల్గివున్నను తన మరణము సమీపించినదని ఆర్థిక త్యాగము చేయడానికి సిద్ధపడుతాడు.

**రెండవది:-** "దీని ద్వారా ఈ లోపము సంభవిస్తుంది,

అనగా ఒక వ్యక్తి 250 లేదా 300 రూపాయల వేతనము పొందుచుండును. ధార్మిక సేవను ఉపేక్షించును. అతనికి ఏ ఆస్తి వుండదు. ఇటువంటి సమయంలో వసియ్యత్ చేసి వసియ్యత్ మూలార్థమునకు వ్యతిరేకముగా వ్యవహరించి వసియ్యత్ చేసేవారిలో చేరును.

నా దృష్టిలో ఒక వ్యక్తి బ్రతుకుదెరువు అతని ఆస్తిపై ఆధారపడి ఉన్నదా లేక అతని వేతనము పై ఆధారపడి ఉన్నదా గమనించాలి. అతడి వేతనముపై ఆధారపడి వుండినచో దానికి వసియ్యత్ చేయవలెను. లేనిచో హాస్యస్పదమగును. అటులనే ఆ వ్యక్తి ధర్మ శాసనములో దేనినైన బహిర్గతముగా ఉల్లంఘించు చున్నాడా? అని తప్పక చూడవలెను. బహిర్గతము అనే నిబంధన ఎందుకనగా హృదయ భావాలను అల్లాహ్ ఎరుగును. కావున నా దృష్టిలో గడ్డము తీసి ఇస్లాం ఆచారములను అగౌరవపరచువాని వసియ్యత్ కూడా సరియైనది కాదు. ఎందుకనగా అతడు ఇస్లాం చిహ్నములను అగౌరవపరుస్తాడు."

(అల్ ఫజల్ పత్రిక సంఖ్య 45, సంపుటి 7,
సంచిక 8, డిసెంబరు 1919)

# క్రీ.శ. 1935 నాటి సలహాల సమితి తీర్పు ప్రకారము తీర్మానము నెం. 280 ఆదాయంలో చందా (భాగము) చెల్లించుట గూర్చి

తీర్మానము నెంబరు. 280 తేది 3-7-1935 ఆర్థిక వ్యవస్థ అధికారి నివేదిక, తీర్మానము నెంబరు. 142 తేది 12-6-1935 ను అమలు చేయుటకు గత సలహాల సమితి నివేదించిన తీర్మానములను దిగువ వివరిస్తున్నాను.

## ఆదాయానికి నిర్వచనము

అన్ని రకాల సంపద అది భూమి ద్వారా గాని, గృహము ద్వారా గాని, యంత్రముల ద్వారా గాని, డబ్బు, స్వీయవృత్తి ద్వారా గాని కలుగు సంపద, లభించు ఆదాయముపై చందా చెల్లించుట అనివార్యమగును. అదేవిధముగా బహుమానం లేదా ఉపకార వేతనము లేదా జీవన భృతి నగదు రూపములో లభించు దానిపై కూడా చందా అనివార్యము. కాని వారసత్వములో మూలధనముగా లభించే ఆస్తి సంపత్తిగా భావించబడును. ఆదాయముగా కాదు. ఈ ఆదాయము నుండి దిగువ సూచించినవి మినహాయించ బడును.

ప్రభుత్వ పన్ను ఉదా॥ రెవిన్యూ, స్థానిక పన్ను, క్యాంపు ఖర్చులు, వంట చెరకు, బొగ్గు ఖర్చులు మొదలగునవి. ప్రయాణపు ఖర్చులు. అంతేగాక ఆదాయమును పొందుటకు చేసిన ఖర్చులు కూడ మినహాయించవలెను. ఉదా॥ వ్యవసాయ ఆదాయము నుండి ప్రభుత్వ పన్నులు, వ్యవసాయములో సహాయపడువారికి ఇవ్వబడు

రుసుము కూడ మినహాయించబడును. వ్యవసాయ ఖర్చుల నుండి విత్తనముల ఖర్చు ఆదాయము నుండి మినహాయించరాదు. ఈ మినహాయింపులు గాక అన్ని రకాల ఆదాయము వ్రాసిన బడ్జెట్ నిర్ధారణ పత్రముకు బదులు ఉదా॥ కాలమ్ నెంబరు 6 ఉద్యోగము క్రింద ప్రతిఫలము, వ్యక్తిగత ఖర్చులు, ఇతర అలవెన్సులు బహుమానములు, ఉపకారవేతనము, జీవన భృతి, నగదు అన్నియూ వ్రాయవలెను. వేతనము నుండి ప్రావిడెంట్ ఫండ్ మినహాయించ రాదు. పూర్తి వేతనము ప్రావిడెంట్ ఫండ్ మినహాయించ కుండా ఆదాయముగా చూపించవలెను.

## వసియ్యత్ వ్రాయుటను గూర్చి ఒక ముఖ్య వివరణ

వసియ్యత్ ఆమోదించబడిన తేది నుండి గాని వ్రాసిన తేది నుండి గాని అమలగు విషయము వసియ్యత్ చేసేవారిపై ఆధారపడి వుండును.

మొదటి రూపములో ఆదాయపు భాగమును వసియ్యత్ ఆమోదానంతరము చెల్లించవలెను. కాని వసియ్యత్ చేసినవాడు వసియ్యత్ ఆమోదించక ముందే మరణిస్తే వసియ్యత్ కొట్టివేయ బడును. ఎందుకనగా వసియ్యత్ చేసేవానికి వసియ్యత్ ఆమోదానికి ముందు వసియ్యత్‌ను అమలు చేసే ఉద్దేశమే లేకుండెను. రెండవ దాని ప్రకారము వసియ్యత్ వ్రాసిన తేదీ నుండే ఆదాయంలో భాగమును చెల్లించడము అనివార్యమగును. మూసి (వసియ్యత్ చేసేవ్యక్తి) వసియ్యత్ చేసిన వెంటనే ఆదాయంలో భాగము చెల్లించుట ప్రథమ కర్తవ్యము. అనివార్య కారణాల వలన వసియ్యత్ ఆమోదించబడనిచో ఆదాయంలో భాగము (చందా) సాధారణ చందాలో గల వ్యత్యాసం ప్రకారం మిగులు డబ్బు వసియ్యత్ చేయు వ్యక్తికి గాని అతని వారసులకు గాని తిరిగి ఇవ్వబడును.

# వసియ్యత్ నమూనా-1
## (కేవలము ఆదాయము పై ఆధారపడు వారి కొరకు)

ప్రస్తుతము నాకు ఏ ఆస్తి లేదు. నా జీవనాధారము నెలసరి ఆదాయము. అది ప్రస్తుతము రూ॥....................కలదు. విద్యార్థులు/అవివాహిత స్త్రీలు దీనికి బదులు ఈ వాక్యము వ్రాయవలెను. ప్రస్తుతము నాకు రూ॥ ..........తండ్రి/సంరక్షకుని ద్వారా జేబు ఖర్చులకు లభిస్తాయి. నేను జీవితాంతము నా నెలవారి ఆదాయము నుండి ఎంతైనను 1/.... భాగము సద్ర్ అంజుమన్ అహ్మదియ్యహ్ ఖాదియాన్, భారత దేశము ఖజానాలో జమ చేయుదును. భవిష్యత్తులో నేను ఏదైనా ఆస్తి సంపాదించినచో కార్యనిర్వాహక సమితికి తెలియపరిచెదను. ఇదియుగాక నా మరణము తరువాత నా ఆస్తిలో 1/..... వ భాగమునకు అధికారి సద్ర్ అంజుమన్ అహ్మదియ్యహ్ ఖాదియాన్, భారతదేశము అవుతుంది. నా ఈ వసియ్యత్ వ్రాయబడిన/ఆమోదించబడిన తేది నుండి వర్తింపజేయగలరు.

| సాక్షి | వసియ్యత్ చేసినవారి | సాక్షి |
|---|---|---|
| సంతకము వేలి ముద్రతో సహా | సంతకము వేలి ముద్రతో సహా | సంతకము వేలి ముద్రతో సహా |
| తండ్రి, పూర్తి చిరునామా | తండ్రి, పూర్తి చిరునామా | తండ్రి, పూర్తి చిరునామా |
| తేది..................... | తేది...................... | తేది........................ |

# వసియ్యత్ నమూనా-2

## (కేవలము స్థిరాస్తి ఆదాయముపై ఆధారపడు వారి కొరకు)

నా మరణానంతరము మొత్తము నా స్థిర, చరాస్తుల 1/....వ భాగమునకు అధికారి సదర్ అంజుమన్ అహ్మదియ్య ఖాదియాన్, భారత దేశము అగునని నేను వీలునామా వ్రాస్తున్నాను. ప్రస్తుతము నా మొత్తం స్థిర, చరాస్తుల వివరములు దిగువ గలవు. వాటి ప్రస్తుత విలువ కూడ వ్రాయబడింది.

.................................................................................

.................................................................................

.................................................................................

ఇదియునుగాక ఆస్తి నుండి నా నెలసరి/ వార్షిక ఆదాయము రూ|| ...........నేను జీవితాంతము ఆస్తితో లభించు ఆదాయము పై చందా ఆమ్ నియమానుసారము చందా వసియ్యత్‌ను సదర్ అంజుమన్ అహ్మదియ్యహ్ ఖాదియాన్, భారతదేశమునకు చెల్లించుటకు సమ్మతించుచున్నాను. ఆస్తి ఆదాయము గాకా, అదనముగా ఏదైన ఆదాయము వచ్చినచో దానిని కార్యనిర్వాహక సమితికి తెలియజేయుదును. దాని 1/.......వ భాగమును సదర్ అంజుమన్ అహ్మదియ్యహ్ ఖాదియాన్, భారతదేశమునకు చెల్లిస్తుంటాను. నా ఈ వసియ్యత్ వ్రాయబడిన/ఆమోదించబడిన తేది నుండి వర్తిస్తుంది.

| సాక్షి | వసియ్యత్ చేసినవారి | సాక్షి |
|---|---|---|
| సంతకము వేలి ముద్రతో సహా | సంతకము వేలి ముద్రతో సహా | సంతకము వేలి ముద్రతో సహా |
| తండ్రి, పూర్తి చిరునామా | తండ్రి, పూర్తి చిరునామా | తండ్రి, పూర్తి చిరునామా |
| తేది...................... | తేది....................... | తేది......................... |

**గమనిక :-**

(1) భూమి లేదా గృహమున్నచో దాని ప్రాంతము, విస్తీర్ణము, సుమారు ధర వ్రాయవలెను. ఆస్తి నుండి ఆదాయము వచ్చినచో దానిని వివరించ వలెను.

(2) స్త్రీల మెహరు (వివాహ శుల్కము) వారి ఆస్తిగా పరిగణించ బడును. మెహరు ఎంత? ముట్టినదా లేక భర్త చెల్లించవలసి వున్నదా? అను విషయములను వసియ్యత్‌లో తెలుపుట అనివార్యము. భర్త చెల్లించవలసి యున్నచో ఇంత మెహరు నేను చెల్లించాలని, దీని వసియ్యత్ భాగమును సద్‌ర్ అంజుమన్ అహ్మదియ్యాహ్ ఖాదియాన్, భారత దేశము ఖజానాలో జమ చేయుటకు నేను బాధ్యత వహింతునని వసియ్యత్‌లో వ్రాయవలెను.

(3) వీలునామాలో పొందుపర్చబడు ఆభరణముల వివరములు, వాటి ప్రస్తుత ధర కూడ వ్రాయవలెను.

(4) భర్త నెలవారి ఆదాయమును తెలియజేయవలెను. వారు వసియ్యత్ చేసినారా? లేదా? అనే దానిని కూడ తెలుపవలెను. వసియ్యత్ చేసినచో వసియ్యత్ నెంబరు.........

## వసియ్యత్ నమూనా -3
## (ఆస్తి ఆదాయము, నెలవారి ఆదాయముపై ఆధారపడు వారి కొరకు)

నా మరణానంతరము నా మొత్తము స్థిర, చరాస్తుల 1/.....వ భాగమునకు సద్‌ర్ అంజుమన్ అహ్మదియ్యాహ్ ఖాదియాన్, భారత దేశము అధికారి అవుతుందని నేను వసియ్యత్ చేస్తున్నాను. ప్రస్తుతము నా స్థిర, చరాస్తుల వివరములు దిగువ చూపబడినవి. వాటి ప్రస్తుత విలువ కూడ వ్రాయబడింది.

.......................................................

.......................................................

.......................................................

ఆస్తి మరియు నెలసరి ఆదాయముపై నా ఆధారము గలదు.

1. ఆస్తి నుండి వచ్చు వార్షిక ఆదాయము రూ॥...........

2. నెలవారి/వార్షిక ఆదాయము రూ॥...............ఉద్యోగము/ వ్యాపారము మొ॥ వాటి ద్వారా.

ఆస్తి ఆదాయముపై చందా ఆమ్ (1/16) ప్రకారముగా ఆదాయపు భాగమును మరియు నెలవారి ఆదాయముపై 1/......వ భాగము నా జీవితాంతము నియమానుసారముగా సదర్ అంజుమన్ అహ్మదియ్యహ్ ఖాదియాన్, భారత దేశమునకు చెల్లించెదను. నా యొక్క ఈ వసియ్యత్ వ్రాయబడిన/ఆమోదించబడిన తేది నుండి వర్తించును.

| సాక్షి | వసియ్యత్ చేసినవారి | సాక్షి |
|---|---|---|
| సంతకము వేలి ముద్రతో సహా | సంతకము వేలి ముద్రతో సహా | సంతకము వేలి ముద్రతో సహా |
| తండ్రి, పూర్తి చిరునామా | తండ్రి, పూర్తి చిరునామా | తండ్రి, పూర్తి చిరునామా |
| తేది...................... | తేది....................... | తేది......................... |

**గమనిక :-** 1. ఈ వసియ్యత్‌లో కూడ వసియ్యత్ నమూన-2 లో వివరించబడిన నాలుగు అంశములు దృష్టియందుండవలెను.

# చందా ప్రథమ నిబంధన, వసియ్యత్ ప్రకటన

వసియ్యత్ చేసే ప్రతి వ్యక్తితో "చందా ప్రథమ నిబంధన", "చందా వసియ్యత్ ప్రకటన" తీసుకొనబడును. ఈ చందాల చెల్లింపు మరియు సద్ర్ అంజుమన్ అహ్మదియ్యహ్ ఖజానాలో జమచేయడము వసియ్యత్ చేసిన వెంటనే తప్పక జరగాలి. ప్రతి వసియ్యత్ పూర్తగుటకు ఈ చందాల చెల్లింపు ఒక అనివార్య అంశము. ఈ చందాలు చెల్లించనిచో వసియ్యత్ పూర్తి కాదు మరియు దాని ఆమోదమునకు ఎలాంటి చర్య తీసుకోబడదు. కావున వసియ్యత్ కార్యదర్శులతో చేయు మనవి ఏమనగా ప్రతి వసియ్యత్‌తో ఈ రెండు చందాలు తొందరగా వసూలు చేసి ఆర్థిక కార్యదర్శులకు అప్పగించవలెను. ఆర్థిక కార్యదర్శులతో చేయు మనవి ఏమనగా వారు ఈ చందాలను జాప్యము చేయకుండా సాధ్యమైనంత త్వరగా సద్ర్ అంజుమన్ అహ్మదియ్యహ్ ఖజానాలో జమచేయవలెను. వసియ్యత్ (వీలునామా) కార్యాలయానికి చేరింది, కాని ఈ చందాలు వసియ్యత్ కర్తతో వసూలు కానేలేదు, లేదా వారి నుండి వసూలు అయినాయి కాని కార్యదర్శులు ఖజానా లో జమచేయుటలో అనవసర జాప్యమును ప్రదర్శించారు, ఇలా జరగకూడదు. వసియ్యత్ కర్త తన వసియ్యత్‌తో ఈ రెండు చందాలు చెల్లించనిచో అటువంటి వసియ్యత్ కార్యాలయానికి పంపుట వ్యర్థము. ఎందుకనగా దానిపై ఎలాంటి చర్య తీసుకోబడదు.

**వసియ్యత్ ప్రకటన చందా:** ఇది పరిస్థితులకనుగుణముగా మారుచు వుంటుందని తెలుపుట తప్పనిసరి.

**ప్రథమ నిబంధన చందా:** దీని గూర్చి వసియ్యత్ మరియు ఆర్థిక కార్యదర్శులు ఎల్లప్పుడు ఒక విషయమును జ్ఞప్తియందుంచు కొనవలెను. అదేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం

అల్ వసియ్యత్‌లో ఈ చందాకు ఎలాంటి పరిమితి నిర్ణయించలేదు. వసియ్యత్ కర్త "తన సామర్థ్యానుసారము" ఈ చందా చెల్లించ వలెనని నిర్ణయించడమైనది. తద్వారా వచ్చు డబ్బుతో రక్షణ మరియు అలంకార అవసరాలు పూర్తి చేయవచ్చును. కాని వసియ్యత్‌లో నెలవారి ఆదాయము ఐదు వందలు, లేదా వెయ్యి రూపాయలు వ్రాసి లేదా నలబై, యాబై వేల ఆస్తిని వ్రాసి వసియ్యత్ కర్త కేవలము రెండు, మూడు రూపాయలు ప్రథమ నిబంధన చందా చెల్లించి సరిపుచ్చుకోవడము దీనికర్థము కాదు. ఎందుకనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పదాలు "తన సామర్థ్యాను సారము" అని గలవు. దీనికర్థము, భావము ఇది కాదు. ఇంత స్వల్ప డబ్బుతో బహిష్తీమఖ్‌బరహ్ అవసరాలు పూర్తి కాలేవు. కావున వసియ్యత్ కర్త తన నెలవారి ఆదాయమును, తన ఆస్తిని సామర్థ్యము, ధర మరియు బహిష్తీమఖ్‌బరహ్ అవసరాలను దృష్టియందుంచుకొని ప్రథమ నిబంధన చందా చెల్లించవలెను.

వసియ్యత్ మరియు ఆర్థిక కార్యదర్శులు ఈ విషయాలను గమనించి ఈ చందాను వసూలు చేయవలెను. ఇది ప్రతి నెల, ప్రతి సంవత్సరము చెల్లించు శాశ్వత చందా కాదు. ఇది వసియ్యత్ తో ఒకే పర్యాయము చెల్లించవలెను. కావున ప్రతి వసియ్యత్ కర్త ప్రథమ నిబంధన చందా చెల్లించేటప్పుడు, అతడు చెల్లించిన డబ్బు తన "సామర్థ్యానుసారము" చెల్లించినాడా? మరియు అతడు తన "సామర్థ్యానుసారము" ఈ చందా చెల్లింపులో తగ్గుదల చేయలేదని, అతని మనస్సు సంతృప్తి చెందినదా? అని ఆలోచించాలి.

**కార్యనిర్వాహక సమితి కర్యాదర్శి**

# అహ్మదియ్యహ్ సంఘ బైఅత్ నిబంధనలు

## ఇష్తిహార్ తక్మీలే తబ్లీఘ్, 12.01.1889

### హ్జ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్, మహ్దీ మ'హూద్ అలైహిస్సలాం ఖుర్ఆన్, హదీసు ప్రకారము నియమించిన నిబంధనలు

1. సమాధి అయ్యే వరకు "షిర్క్" (అల్లాహ్‌కు భాగస్వాములు చేయుట) నుండి దూరముగా నుందునని బైఅత్ చేసిన వాడు ప్రతిజ్ఞ చేయవలెను.

2. అబద్ధము, వ్యభిచారము, చెడుచూపు, అన్యాయము, ఉపద్రవము, ఎదురు తిరుగుదనము, ప్రతి వ్యసనము మొదలగు దుష్కార్యములకు దూరముండి కామోద్రేకాలకు లొంగక వుండును.

3. అల్లాహ్ అతని ప్రవక్త ఆదేశాల మేరకు క్రమబద్ధముగా ఐదు సమయములు ప్రార్థనలు (నమాజ్) సలుపును. సాధ్యమైనంత వరకు తహజ్జుద్ నమాజ్ సలుపుటకు, నబీయే కరీం సల్లల్లాహు అలైహివసల్లంపై దురూద్ పంపుటకు, ప్రతి రోజు తమ పాపముల క్షమాపణ యాచించుటకు సంసిద్ధుడై సహృదయముతో అల్లాహ్ వరములను స్మరించుచు, స్తుతించుచు ప్రతి రోజును గడుపును.

4. అల్లాహ్ ప్రాణులను సాధరణముగా, ముస్లింలను ప్రత్యేకముగా కామోద్రేకములకు లోనై నాలుకతో గాని, మరే విధముగా గాని పీడించను.

5. సుఖ, దుఃఖాలలో, ఇబ్బందులలో, సౌభాగ్యములలో, జీవిత ఒడుదొడుకులలో గాని అల్లాహ్‌నే నమ్ముకొని అతని ఇష్టాను

సారము జీవించును. అతని మార్గము నందు అవమానము, కష్ట నష్టములకు సిద్ధమైవుండి, ఆపదలు సంభవించినపుడు వెనుకాడక ముందుకు సాగును.

6. ఇస్లాం విరుద్ధ ఆచార వ్యవహారములకు దూరముగా నుండి పవిత్ర ఖుర్‌ఆన్ ఆదేశాలను పూర్తిగా పాటించును, అల్లాహ్, ప్రవక్త ఆదేశాలను తమ జీవిత సూత్రాలుగా చేసుకొనును.

7. అహంకారము, గర్వమును పూర్తిగా వీడి, వినయ విధేయత, సత్ప్రవర్తన, సహనము, దీనత్వమునవలంభించి జీవించును.

8. తమ ప్రాణము, సంతతి, సంపత్తి, ప్రీతిపాత్రుల కంటే ధర్మమును, ధర్మగౌరవ మర్యాదలను ఎక్కువగా అభిమానించును.

9. అల్లాహ్ ప్రీతి కొరకు, అల్లాహ్ సృష్టించిన ప్రాణుల ఎడ సానుభూతి కలిగి వుండును. అల్లాహ్ ప్రసాదించిన బహుమతుల, శక్తుల ద్వారా సాధ్యమైనంత వరకు మానవాళికి లాభము చేకూర్చును.

10. కేవలము అల్లాహ్ ప్రీతి కొరకు నాలో సోదరాభావము కలిగి మరణించు వరకు వినయ విధేయతను ప్రదర్శించును. ఈ బాంధవ్యము ఇతర బంధాలలో కానరాని విధముగా పై స్థాయి నందుకొని వుండును.

